APTEL/2023/88044

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ

సంపుటి : 01 | సంచిక : 241 | ఎడిటర్ : ఎం. రమేష్ | గురువారం, ఆగస్టు 1, 2024 | పేజీలు : 08 | వెల రూ. 5.00/-

## ఎపి కేబినెట్ భేటీ వాయిదా

పెన్షన్ల పంపిణీతో వాయిదా పడ్డట్టు సమాచారం




**అమరావతి,జూలై31(పీపుల్స్ మోటివేషన్):**

ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం వాయిదా పడింది. ఆగస్టు 2న ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరుగవలసిన సమావేశం వివిధ ప్రభుత్వ కార్యాక్రమాల వల్ల వాయిదా వేశారు. రేపటి నుంచి రెండు రోజుల పాటు పింఛన్ల (పంపిణీ కార్యక్రమం ఉండడంతో సమావేశాన్ని వాయిదా వేసుకున్నారు. పింఛన్ల పంపిణీని పండుగ వాతావరణంలోఅన్ని నియోజకవర్గాలు, గ్రామాల్లో ముఖ్యమంత్రి, మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో నిర్వహించాలని గతంలో ప్రభుత్వం నిర్ణయించింది. దీంట్లో భాగంగా మంత్రులు కూడా పంపిణీలో పాల్గొననున్న దృష్ట్యా ఈ మంత్రి వర్గ సమావేశాన్ని వారం చివరల్లో నిర్వహించనున్నారు.గత ఎన్నికల్లో ప్రజలకు కూటమి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం, ఇళ్ల పంపిణీ తదితర హామీలపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఆయా శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో చర్చించాల్సిన అంశాలను, ప్రతిపాదనలను సాధారణ పరిపాలన శాఖకు అందజేయాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులకు ఏపీ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ (జొ॥సజీశిత ఐబీపజీస ఖసజీబజీట) ఆదేశాలు జారీ చేశారు.


# ఎపికి క్యూ కడుతున్న పారిశ్రామిక వేత్తలు

**అమరావతి,జూలై31(పీపుల్స్ మోటివేషన్):** ఆంధ్రప్రదేశ్‌లో దేశంలోనే ఉత్తమ పారిశ్రామిక విధానాన్ని తీసుకురానున్నామని ఏపీ పరిశ్రమశాఖ మంత్రి టిజి భరత్ వెల్లడించారు. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమీక్ష నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 2014-19 వరకు చంద్రబాబు హయాంలో ఏపీలో పారిశ్రామిక విధానాన్నికి ఆకర్షితులైన అనేక మంది పారిశ్రామిక వేత్తలు పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చారని వివరించారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఐదేండ్లలో పరిశ్రమల ఏర్పాట్లకు ఫ్రెండ్లీ వాతావరణం కల్పించలేకపోయారని ఆరోపించారు. గతంలో పెట్టుబడులకు పారిశ్రామిక వేత్తలు భయపడే పరిస్థితి ఉండేదని ఆరోపించారు. రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లో పారిశ్రామికి క్లస్టర్లు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు సూచించారని వెల్లడించారు.

- దేశంలోనే ఉత్తమ పారిశ్రామిక విధానం
- అధికారులతో సిఎం చంద్రబాబు సమీక్ష
- వివరాలు వెల్లడించిన మంత్రి భరత్



5



## ఏపీలో కంపెనీల ఏర్పాటుకు సహకారం అందించండి

రాష్ట పరిశ్రమలు, వాణిజ్యం,
ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్
అమెరికా కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్‌తో
మంత్రి టి.జి భరత్ భేటీ



**అమరావతి, జులై 31 (పీపుల్స్ మోటివేషన్):-**

ఆంధ్రప్రదేశ్‌లో కంపెనీలు ఏర్పాటుచేసేందుకు సహకరించాలని అమెరికా కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్‌ను కోరినట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ తెలిపారు. విజయవాడలో జెన్నిఫర్ లార్సన్‌ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఆయన చెప్పారు. ఏపీలో పెట్టుబడులు పెట్టే వారికి అన్ని విధాలుగా సహకరిస్తామని అవకాశాలను వివరించినట్లు మంత్రి టి.జి భరత్ పేర్కొన్నారు. అమెరికాలో తెలుగువాళ్లు ఎంతో మంది ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. ఏపీలో కంపెనీలు విస్తరించేందుకు కృషి చేయాలని కోరానన్నారు. ఈ విషయంపై ఆమె సానుకూలంగా స్పందించినట్లు మంత్రి తెలిపారు.

## హైదరాబాద్ చేరుకున్న జిష్ణుదేవ వర్మ

ఘనంగా స్వాగతం పలికిన సిఎం రేవంత్


**హైదరాబాద్,జూలై31(పీపుల్స్ మోటివేషన్):**
తెలంగాణ రాష్ట్ర కొత్త గవర్నర్‌గా నియామకమైన జిష్ణుదేవ్ వర్మ హైదరాబాద్‌కు చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో జిష్ణుదేవ్ శర్మ దంపతులకు సీఎం రేవంత్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారితో పాటు డీజీపీ జితేందర్ ఘన స్వాగతం పలికారు. అలాగే త్రివిధ దళాల అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్, ఇతర ఉన్నత అధికారులు గవర్నర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతించారు. అనంతరం గవర్నర్ సాయుధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తెలంగాణ గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మను నియమించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన రాష్ట్ర గవర్నర్‌గా బుధవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. మొన్నటి వరకు తెలంగాణ ఇన్‌చార్జి గవర్నర్‌గా జార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణ వ్యవహరించిన విషయం తెలిసిందే. రాధాకృష్ణన్‌ను కేంద్రం మహారాష్ట్రకు బదిలీ చేసింది.



## జిఎస్టీ వాతలపై గళం విప్పిన గడ్కరీ

జనరల్, హెల్త్ ఇన్సూరెన్స్‌లపై 18శాతం జిఎస్టీయా?
ఇది వ్యక్తి కష్టం, ఆరోగ్యాలపై పన్ను విధించడమే
వెంటనే దృష్టి సారించాలంటూ నిర్మలా సీతారామన్‌కు లేఖ

6



## సిఎం రేవంత్‌తో మంత్రాలయ పీఠాధిపతి భేటీ

**హైదరాబాద్,జూలై31(పీపుల్స్ మోటివేషన్):**



మంత్రాలయం పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ సుబుదేంద్ర తీర్థ స్వామీజీ బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసారు. ఆగస్టు 20,21,22న మంత్రాలయంలో జరిగే రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలకు ముఖ్యమంత్రిని పీఠాధిపతి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. స్వామితో పాటు ఎమ్మెల్యేలు వాకాటి శ్రీహరి, చిట్టెం పర్ణికా రెడ్డి, జి. మధుసూదన్ రెడ్డిలు సిఎంను కలిశారు. ఈ సందర్భంగా సిఎం పీఠాధిపతిని సన్మానించారు.

## పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

మడకశిరలో పంపిణీ చేయనున్న బాబు

**అమరావతి,జూలై31(పీపుల్స్ మోటివేషన్):**



ఆంధ్రప్రదేశ్‌లో వరుసగా రెండో నెల సామాజిక పెన్షన్లను ఒకటో తేదీన ఉదయమే పంపిణీ చేయనున్నారు. ఉదయం 6 గంటల నుంచి పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పెంచిన పెన్షన్ మొత్తాల పంపిణీలో ప్రజాప్రతినిధులు, మంత్రులు పాల్గనాలని ఇప్పటికే సీఎం చంద్రబాబు సూచించారు. ఈ మేరకు అన్ని చోట్లా ప్రజాప్రతినిధులు భాగమయ్యేందుకు సన్నాహాలు చేసుకున్నారు. సీఎం చంద్రబాబు మడకశిర మండలం గుండుమలలో లబ్దిదారులకు ఇంటి దగ్గరే పింఛన్లు అందజేయనున్నారు. మల్బరీ నాట్లు, పట్టు పురుగుల షెడ్లను కూడా పరిశీలిస్తారు. కరియమ్మదేవి ఆలయాన్ని సందర్శించి, గ్రామస్థులతో సీఎం మాట్లాడనున్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కోసం ప్రభుత్వం రూ.2,737.41 కోట్లను ఇప్పటికే బ్యాంకుల నుంచి విడుదల చేసి.. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల వేల్ఫేర్ ఆఫీసర్లకు చేర్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 64. 82 లక్షల మందికి గురువారం ఉదయం 6 గంటల నుంచే పెన్షన్ల పంపిణీని ప్రారంభించాలని సీఎస్ నీరభ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి 1వ తేదీన 96 శాతం, 2న 100 శాతం పెన్షన్ల పంపిణీని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వఅద్ధులు, వితంతువులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు అందిస్తున్నారు. జూలై ఒకటో తేదీన గుంటూరు జిల్లా పెనుమాకలోని ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న బాణావత్ పాములు నాయక్ కుటుంబానికి చంద్రబాబు పింఛన్ అందజేశారు. పాముల నాయక్‌కు వృద్దాప్య పింఛన్, ఆయన భార్యకి కూడా రాజధానిలో భూమిలేని వారికి ఇచ్చే పింఛన్, కూతురు సాయికి వింతంతు పింఛన్ అందజేశారు. పింఛన్ పంపిణీ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రామంలోని మసీదు సెంటర్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పెంచిన పింఛన్‌తోపాటు మూడు నెలల బకాయిలను కూడా అందజేసినట్టు చెప్పారు. ప్రతి కుటుంబం తమ పిల్లలను చదివించుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు చంద్రబాబు. తాను తొలి పింఛన్ ఇచ్చిన కుటుంబానికి ఇల్లు కట్టించి ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంని హామీ ఇచ్చారు. చుట్టూ పక్కా భవనాలు ఉంటే ఈ ఒక్క కుటుంబం మాత్రం పూరిగుడిసెలో ఉందని చెప్పారు. తర్వాత వారం రోజుల్లోనే ఇంటి నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యేలా చూశారు. చంద్రబాబు నాలుగు వేల పెన్షన్ ను ఎన్నికల హామీగా ఇచ్చారు. వెంటనే అమలు ప్రారంభించారు. గత మూడు నెలల బకాయిలుతో కలిసి ఏడు వేల రూపాయలు గత నెలలో పంపిణీ చేశారు. ఈ నెల నుంచి ఒక్కొక్కరికి నాలుగు వేల పెన్షన్ అందనుంది.

తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation

## సంపాదకీయం

### ప్రకృతి విధ్వంసానికి సాక్షి కేరళ !



ప్రకృతి విధ్వంసానికి పరాకాష్టగా కేరళ విలయాన్ని చూడాలి. అక్కడి కొండలు, గుట్టలను, భారీ వృక్షాలను నరుతూ పోతున్నారు. పెరుగుతున్న జనాభా కారణంగా కేరళ కూడా ఇలాంటి విధ్వంసానికి సాక్షిగా నిలిచింది. అందుకే అదే విషాదం.. దేవభూమిగా పేరున్న అందాల కేరళలో విధ్వంసం జరిగింది. విలయం సృష్టించింది. ఇప్పటికే 13 మందికి పైగా మృత్యువాత పడ్డారు. ఓ గ్రామం నేలమట్టం అయ్యింది. నిజంగా ఇదో హెచ్చరికగా చూడాలి. దేశం యావత్తూ దీనినుంచి గుణపాఠ చేర్చుకోవాలి. ఇలాంటి విధ్వంసాలకు కారణాలు తెలుసుకోవాలి. ప్రకృతిని దెబ్బతీస్తే దాని దెబ్బ ఎలా ఉంటుందో గమనించాలి. ఏటా వచ్చే రుతుపవనాలు కేవలం వర్షాలను మాత్రమే కురిపించి ఆగిపోవడం లేదు. విధ్వంసాన్ని సృష్టిస్తున్నాయి. 2015 నుంచి 2022 మధ్య కాలంలో దేశ వ్యాప్తంగా కొండచరియలు విరిగిపడ్డ ఘటనలు 3 వేల 782 జరిగితే అందులో కేరళలోనే అత్యధికంగా జరిగాయన్నది పార్లమెంట్ సాక్షిగా 2022లో కేంద్ర మంత్రి జితేందర్ సింగ్ వెల్లడించిన వాస్తవం. తాజాగా మరోసారి వయనాడ్‌లో జిల్లాలో వర్షాలు, వరదలు సృష్టించిన బీభత్సం తో కేరళ తీవ్రంగా తల్లడిల్లిపోతోంది. అందాల టీ తోటలకు, పచ్చని ప్రకృతికి పేరున్న వయనాడ్ ఇప్పుడు వరదల ధాటికి భయానకంగా మారింది. ముఖ్యంగా వయనాడ్ జిల్లాలోని మెప్పాడి, చురామల, మందక్కాయి, అట్టమల, నులుప్పూజ పరిసర ప్రాంతాల్లో విరిగిపడ్డ కొండచరియలు వందలాది కుటుంబా లలో విషాదం నింపాయి. మృతుల సంఖ్య పెరుగుతూనే వస్తోంది. భారీ వర్షాలు కూడా కురుస్తూ ఉండటం స్థానిక నదులు ఉప్పొంగుతున్నాయి. నీటిలో కొట్టుకొస్తున్న మృత దేహాల్లో తమ వారున్నారేమో అన్న భయం, ఆందోళన స్థానికుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఏటా జరుగుతున్న ఈ విధ్వంసానికి ఇప్పటికే కొన్ని కళ్లు అలవాటుప డిపోయినా? తమ కళ్ల ముందే తమ రక్తసంబంధీకులు, స్నేహితులు అన్యాయంగా ప్రాణాలు కోల్పోతుంటే వారి దుఃఖాన్ని ఆపడం ఎవ్వరి తరం కావడం లేదు. నిజానికి ఈ పరిస్థితి కేరళకు కొత్తేం కాదు. జులై, ఆగస్టు నెలలు వస్తే చాలు కేరళలో భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగి పడటం కొన్నేళ్లుగా సర్వ సాధారణంగా మారుతూ వస్తోంది. కేరళకు పశ్చిమాన విస్తారమైన సముద్రతీరం ఉంటే? తూర్పున పర్వత ప్రాంతాలు ఎక్కువగా ఉంటాయి. దీంతో ప్రతి జులై నెలాఖరు, ఆగస్టు నెలల్లో విస్తారమైన వర్షాలు కురుస్తాయి. ఫలితంగా కొండల్లో ఉన్న సెలయేళ్లు, నదులు ఉధృతంగా ప్రవహిస్తూ కొన్ని సార్లు ఈ ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. 2018లో వచ్చిన వరదలు కేరళలో విధ్వంసం సృష్టించాయి. సుమారు 600 మంది ప్రాణాలు కోల్పోగా ఏకంగా 31 వేల కోట్ల రూపాయలన ఆస్తి నష్టం సంభవించింది. ఈ ప్రకృతి విపత్తు 2015-2019 మధ్య కాలంలో ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ మార్పుల కారణంగా సంభవించిన అత్యంత ఘోర విపత్తులలో ఒకటిగా ప్రపంచ వాతావరణ సంస్థ పేర్కొంది. 2019లోనూ సంభవించిన వరదల కారణంగా 121 మంది ప్రాణాలు కోల్పోగా సుమారు 2 లక్షల మంది బాధితులుగా మిగిలారు. అలాగే అదే ఏడాది కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. సుమారు 22 వేల మంది నిరాశ్రయులయ్యారు. 2020 ఆగస్టులో ఇడుక్కి, వయనాడ్, మలప్పురం, కొట్టాయం ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలు, విరిగిపడ్డ కొండచరియలు కారణంగా 66మంది ప్రాణాలు కోల్పోయారు. 2021లో 42 మంది, 2022లో 32 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. తాజాగా వయనాడ్ జిల్లాలో జరిగిన ఘటనలో ప్రాణ, ఆస్తి నష్టం ఇంకా పూర్తి స్థాయిలో వెల్లడి కావాల్సి ఉంది. 2024 జనవరిలో కేరళ యూనివర్శిటీ ఆఫ్ ఫిషరీస్ అండ్ ఓషన్ సైన్సెస్ .. మిచిగాన్ టెక్నాలాజికల్ యూనివర్శిటీ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియరాలజీలు సంయుక్తంగా చేసిన పరిశోధనలో కేరళకు సంబంధించి ప్రమాద ఘంటికలు మోగించే వాస్తవాలు వెల్లడయ్యాయి. రాష్ట్రం మొత్తం మీద 13 శాతం భూభాగంలో ల్యాండ్ స్లైడ్స్ విరుచుకుపడే ప్రమాదం ఉందని తేలింది. ప్రధానంగా ఇడుక్కి, పాలక్కడ్, మలప్పురం, పట్టణంతిట్ట, వయనాడ్ ప్రాంతాలు అత్యంత ప్రమాదకరమైన జోన్‌లో ఉన్నాయని ఆ పరిశోధన వెల్లడించింది. ఏఐ సాంకేతిక పరిజ్ఞానం సాయంతో రాష్ట్రంలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నప్రాంతాల మ్యాప్‌ను కేరళ యూనివర్శిటీ ఆఫ్ ఫిషరీస్ సిద్ధం చేసింది. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరిశోధన ప్రకారం కేరళలో 43 శాతం భూభాగం భూపాతానికి గురయ్యే ప్రమాదం ఉందని తేలింది. ఇడుక్కిలో 74 శాతం, వయనాడ్‌లో 51 శాతం భూభాగం ముఖ్యంగా పర్వత ప్రాంతాల్లో ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉందని ఆ సంస్థ వెల్లడించింది. 2019లో కొండచరియలు విరిగిపడ్డ ఘటనలో కేరళ వ్యాప్తంగా 80 సంభవించాయి. 2018లో ఏకంగా 341 ఘటనలు జరిగాయి. వాటిల్లో కేవలం ఇరుక్కి జిల్లాలోనే 143 ఘటనలు జరిగాయి. 2015 నుంచి 2022 మధ్య కాలంలో మొత్తంగా 3782 ఘటనలు సంభవించగా అందులో కేవలం దక్షిణాదిలోనే 2239 ప్రమాదాలు జరిగాయి. మిగిలిన ప్రాంతాల్లో చూస్తే అత్యధికంగా పశ్చిమ బెంగాల్లో అత్యధికంగా 376 ఘటనలు జరిగాయి. 2018 నుంచి 2021 మధ్య కాలంలో కేవలం ఒక్క కేరళ రాష్ట్రంలోనే సుమారు600 మంది ప్రాణాలు కోల్పోగా, వేలాది మంది నిరాశ్రయు లయ్యారు. కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలు పడటం నదులు పొంగడం మాకు అలవాటే. కానీ మంగళవారం వేకువ జామున విపరీతమైన నీటి ప్రవాహ శబ్దాలు వినిపిస్తున్నాయి. ఎప్పుడూ వినని శబ్దాలు. కేరళలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు వయనాడ్ అల్లాడిపోయింది. దీనికి తోడు కొండచరియలు విరిగిపడటంతో వందల మంది కొట్టుకుపోయారు. శిథిలాలు తవ్వి తీస్తున్న కొద్దీ శవాలు వెలుగుచూస్తూనే ఉన్నాయి.

# ప్రభుత్వానికి సినీ పరిశ్రమ సహకరించడం లేదా?

**గద్దర్ అవార్డులపై ఎందుకీ ఆలస్య స్పందన**
**గద్దర్ పేరు పెట్టడం ఇష్టం లేకనేనా?**
**సర్వత్రా ఇప్పుడు ఇదే చర్చ**

**హైదరాబాద్,జూలై31(పీపుల్స్ మోటివేషన్) :**


సినీపరిశ్రమ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పెద్దగా పట్టించుకో వడం లేదా అన్న అనుమానాలు వస్తున్నాయి. నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డులను ప్రకటించినా పెద్దగ ఆస్పందన రాలేదు. మరోమారు దీనిపై ప్రశ్నించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి నేరుగానే చెప్పాను. నంది అవార్డులకు బదులుగా గద్దర్ అవార్డులు ఇస్తామని చెప్పినా పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సినీ పరిశ్రమ వైపు నుంచి ఎలాంటి ముందడుగు పడలేదని.. కనీసం సంప్రదించలేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే చిరంజీవి స్పందించి ప్రొడ్యూసర్స్ కౌన్సిల్, ఫిలిం చాంబర్ ను అప్రమత్తం చేశారు. నేడో రేపో ఇండస్ట్రీ బృందం ప్రభుత్వ పెద్దల్ని కలవొచ్చు. కానీ అసలు సమస్య అది కాదని.. రేవంత్ సినీ ఇండస్ట్రీ నుంచి మరింత సహకారం కోరుకుంటున్నారన్న వాదన వినిపిస్తోంది. సిఎంను కలసి మాట్లఅడుతామన నిర్మాత తమ్మారెడడ్డి భరద్వాజ కూడా తెలిపారు. రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కొంత మంది సినీ ప్రముఖులు కలిశారు. అవన్నీ వ్యక్తిగత భేటీలు. ఇండస్ట్రీ తరపున ఎవరూ ప్రత్యేకంగా ప్రతినిధి బృందంగా కలవలేదు. సహకారం కోరలేదు. గత ప్రభుత్వంతో ఇండస్ట్రీ పెద్దలు ఎంతో సఖ్యతగా ఉండేవారు. అయిన దానికి కాని దానికి సపోర్టుగా సోషల్ మీడియాలో



ప్రచారం చేసేవారు. ఉదాహరణకు.. మొక్కలు నాటే కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వం పిలుపునిస్తే.. సినీ ప్రమఖులంతా మొక్కలు నాటి వాటిని సోషల్ మీడియాలో పెట్టేవారు. గొప్ప కార్యక్రమం చేపట్టారని అభినందించేవారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం పిలుపునిచ్చినా స్పందన కానరావడం లేదు. కొద్ది రోజుల క్రితం.. సినిమా ప్రారంభానికి ముందో తర్వాతో.. డ్రగ్స్ కు వ్యతిరేకంగా సందేశం ఉండాలని రేవంత్ ప్రకటించారు . దీనిపై ఒకరిద్దరు తప్ప పెద్దగా ఎవరూ స్పందించలేదు. సిద్దార్థ్ ఇంకా వ్యతిరేకంగా స్పందించారు. తమకు ఉన్న బాధ్యత గురించి ఆయన చెప్పాలా అన్నట్లుగా మాట్లాడారు. తర్వాత క్షమాపణలు చెప్పారు కానీ..అప్పటికే నెగెటివ్ గా వెళ్లిపోయింది. ఇండస్ట్రీ మొత్తం ఈ అంశంపై ఓ తీర్మానం చేసి.. సీఎం నిర్ణయం ద్వారా... సమాజంలో తమ వంతు పాత్ర పోషిస్తామని సమైక్యంగా చెప్పలేకపోయారు. ఇది కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని అసహనానికి గురి చేసి ఉంటుందని అంటున్నారు. సినిమా ఇండస్ట్రీకి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తోంది. భారీ సినిమాలు వస్తే ఎక్స్ ట్రా షోలు, టిక్కెట్ రేట్ల పెంపకం వంటి విషయాల్లో వారు అడినట్లుగానే ఉత్తర్వులు ఇస్తున్నారు. కనీసం తిప్పించుకోవడం లేదు కూడా. ఈ మాత్రం సహకారం అందే ప్రభుత్వం పట్ల ఇండస్ట్రీ నిర్లక్ష్యంగా ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డులు ఇస్తామన్నారు. ఈ అవార్డులపై ఇండస్ట్రీ ఆసక్తి చూపించలేదు. బహుశా పేరు కారణం కావొచ్చన్న వాదన ఉంది. కానీ గద్దర్ అవార్డులు అనేది గొప్పగా లేవని.. ఓ అవార్డుకు ఆ పేరు పెట్టి మిగతా మొత్తానికి నంది లేదా.. మరో ఉన్నతమైన పేరు పెట్టాలన్న ఆలోచనను యినా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉందన్న అభిప్రాయం ఉంది. అయితే అదే విషయం చర్చించవచ్చు. కానీ అలాంటిదేమీ లేదు. తెలంగాణ ఏర్పాటు తర్వాత సినీ ఇండస్ట్రీ .. ఏపీ ప్రభుత్వంలోనే ఎక్కువ సఖ్యతగా ఉంది. ఈ అంశంపై బీఆర్ఎస్ పార్టీ పెద్దలు అసంతృప్తి వ్యక్తం చేశారు. సినిమా వాళ్లు ఇప్పటికీ ఏపీ ప్రభుత్వానికే రిపోర్టు చేస్తున్నారని మండిపడ్డారు. ఆ తర్వాత కొన్ని ఘటనలు జరిగాయి. డ్రగ్స్ కేసులు.. కొన్ని చెరువుల ఆక్రమణలు.. రోడ్ల వెడల్పు వంటి అభివృద్ధి పనులు ఇలా వరుస పెట్టి జరగడంతో సీన్ మారిపోయింది. అంతా బీఆర్ఎస్ పెద్దలకు దగ్గరయ్యారు. అప్పట్నుంచి బీఆర్ఎస్ కు సపోర్టుగా ఉంటూనే వచ్చారు. ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ సహకరిస్తున్నా.. అంతగా సహకారం చూపించడం లేదు. కానీ రేవంత్ కూడా గతంలో ప్రభుత్వంపై చూపించినంత ప్రేమ తన ప్రభుతవంపై చూపించాలని కోరుకుంటున్నారన్న వాదన వినిపిస్తోంది.

# వయనాడ్ విపత్తులో 163కు చేరిన మృతులు









**కొనసాగుతున్న సమాయక చర్యలు**
**ఆనవాళ్లు లేకుండా పోయిన పలు గ్రామాలు**

**తిరువనంతపురం,జూలై31(పీపుల్స్ మోటివేషన్):**

వయనాడ్ ప్రకృతి విపత్తులో కొందరు సురక్షితంగా బయటపడి మంగళవారం వేకువజామున జరిగిన విధ్వంసాన్ని గుర్తు చేసుకొని వణికిపోతున్నారు. కేరళలోని వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఇప్పటివరకు 163 మంది చనిపోయినట్లు కేరళ వైద్యారోగ్య శాఖ బుధవారం ఉదయం తెలిపింది. మరో 91 మంది గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో గాయపడిన సుమారు 191 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వయనాడ్‌లో విపత్తు నిర్వహణ బృందాలు, సైనికులు సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. కేరళలోని వయనాడ్ జిల్లా మెప్పడి, మండక్కై, చూరాల్‌మల, అట్టామల, నూల్‌పుజా గ్రామాల్లో సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. కొండ చరియలు విరిగిపడి గ్రామాల ఆనవాళ్లు లేకుండా పోయాయి. వందల ఇళ్లు నేలమట్టమయ్యాయి. వందల మంది బురద మట్టిలో కూరుకుపోయారు. మరోవైపు ఈ గ్రామాల్లోని టీ, కాఫీ తోటల్లో పనిచేసే 600 మంది వలస కూలీల ఆచూకీ దొరకడం లేదని సమాచారం. సోమవారం అర్ధరాత్రి సమయంలో గ్రామస్థులంతా నిద్రలో ఉండగా ఒక్కసారిగా కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో కొండ ప్రాంతం విధ్వంసమైంది. ఇళ్లన్నీ నేలమట్టమయ్యాయి. బురద మట్టిలో కూరుకుపోయిన గ్రామస్థులు ఆ మట్టిలోనే కలిసిపోయారు. తొలుత మండక్కై ప్రాంతంలో కొండచరియలు విరిగిపడ్డాయి.
సమాచారమందుకున్న సహాయక సిబ్బంది వెంటనే అక్కడకు వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. కొంత మంది బాధితులను సమీపంలోని చూరాల్‌మలలోని వెల్లారిమల పాఠశాలవద్ద ఏర్పాటు చేసిన సహాయక శిబిరానికి పంపించారు. మంగళవారం తెల్లవారు జామున 4.10 గంటలకు ఈ పాఠశాల సమీపంలో మరోసారి కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో శిబిరం సహా చుట్టుపక్కల ఇళ్లు, దుకాణాలు బురదలో కూరుకుపోయాయి. అనేక వాహనాలు అందులో ఇరుక్కుపోయాయి. చూరాల్‌మల గ్రామంలోని కొంత భాగం తుడిచి పెట్టుకుపోయింది. మండక్కైలో మంగళవారం మధ్యాహ్నం మరోసారి కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలపై సుదర్శన్ అనే డ్రైవర్ తన అనుభవాలను వివరించారు. మంగళవారం తెల్లవారుజామున 1.30 గంటలకు మెలకువ వచ్చింది. ఎప్పుడూ వినని నీటి ప్రవాహన శబ్దాలు వినిపించాయి. వెంటనే లేచాను. కరెంటు లేదు. చుట్టూ చీకటి అలుముకుంది. ఇన్వర్టర్ కూడా పని చేయడం లేదు. ఇంట్లో ఉన్న పరిస్థితి చూస్తే అది నీటిలో కొట్టుకు పోయిందని అర్థమైంది. ఇంటి బయట ఉండాల్సిన నా జీపు తలుపులు పగలగొట్టుకొని ఇంట్లోకి వచ్చేసింది. ఇంట్లో ఉన్న చాలా వస్తువులు పూర్తిగా నీట మునిగిపోయి ఉన్నాయి. రెండు అడుగులు కూడా వేయడానికి లేని పరిస్థితి ఉంది. ఏదోలా బయటకు వచ్చి చూస్తే మొత్తం మట్టి దిబ్బలే కనిపించాయని అన్నారు.

వాయనాడ్‌లోని చూరల్‌మలలో ఉంటున్న సుదర్శన్ డ్రైవర్‌గా వర్క్ చేస్తున్నాడు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల గురించి పొరుగు వారితో మాట్లాడుతూ ఏం జరుగుతుందో అని భయపడ్డారు. అనుకున్నట్టే ఆ రాత్రి భయానక వాతావరణం వాళ్లకు అనుభవంలోకి వచ్చింది. మొదట ముండక్కై పట్టణాన్ని కొండచరియలు ముంచేశాయి. తర్వాత చూరల్‌మల గ్రామాన్ని కమ్మేశాయి. సుదర్శన్ భయపడింది వాళ్ల అమ్మ భవానీ కోసం. ఆమె క్యాన్సర్ రోగి. తన ఇంట్లో మరికాసేపు ఉంటే కచ్చితంగా తామూ ముగనిగిపోతామని గ్రహించి సుదర్శన తన తల్లిని తీసుకొని అతి కష్టమ్మీద టెర్రస్‌పైకి వెళ్లాడు. 'ఆ క్షణంలో మా అమ్మను రక్షించుకోవాలనే ఆలోచన ఒక్కటే నా బుర్రలో తిరుగుతోంది. ఎక్కడి వెళ్లాలో కూడా తెలియలేదు. మేడపై నుంచి ఆ భయానక దృశ్యాలు చూస్తూ వణికిపోయారు సుదర్శన్, వాళ్ల అమ్మ. సాయం చేసేందుకు కూడా వాళ్లకు ఎవరూ కనిపించలేదు. సాయం కోసం ఎదురు చూడటం.. వరద వస్తే కొట్టుకుపోవడంతో తప్ప వేరే దారి వాళ్లకు లేదు. 'చూరల్‌మల నది మా ఇంటి వెనుక 400 మీటర్ల దూరంలో ప్రవహిస్తుంది. మా ఇంటి చుట్టూ నదీ ప్రవాహమే కనిపించింద. ఇరుగు పొరుగు ఇళ్లు నీటిలో కొట్టుకు పోతున్నాయి. అప్పుడు మా అమ్మతో ఒకటే చెప్పాను. 'ఈ ప్రపంచంలో మనకు నూకలు చెల్లాయని... తర్వాత మన ఇల్లే కొట్టుకుపోవచ్చని అన్నాను.'అని సుదర్శన గుర్తు చేసుకున్నాడు. చుట్టుపక్కల ఇళ్లు కొట్టుకుపోతున్నా.. సుదర్శన ఇల్లు మాత్రం ప్రకృతి విధ్వంసాన్ని తట్టుకొని నిలబడింది. మొత్తం మూడుసార్లు కొండచరియలు విరిగిపడినా వాళ్లు సురక్షితంగా బయటపడ్డారు. వారికి సమీపంలో ఉంటే ఓ కుటుంబంలోని 11 మంది సభ్యులు కనిపించకుండా పోయారు. తను ప్రమాదంలో ఉంటున్న సుదర్శన కొందరిని రక్షించగలిగాడు. సాయం చేయాలని కేకలు వేసిన వారి ఇంటిపైకి నిచ్చెనతో వెళ్లి వారిని తన ఇంటి డాబాపైకి తీసుకొచ్చాడు. ఇలా 20 మందిని రక్షించాడు. సుదర్శన ఇంటితోపాటు జీవనోపాధి అయిన జీపు కూడా పోయింది. ఇప్పుడు లైఫ్‌ను మొదటి నుంచి స్టార్ట్ చేయాలని సుదర్శన్ అంటున్నాడు.

తెలుగు దినపత్రిక
# పీపుల్స్ మోటివేషన్
People's Motivation
గురువారం । ఆగస్టు । 1 । 2024



# వంద రోజుల్లో స్నేహపూర్వక పారిశ్రామిక విధానం

**రాష్ట్ర పారిశ్రామిక, వాణిజ్య, ఆహార శుద్ధి శాఖ మంత్రి టి.జి.భరత్**

**అమరావతి, జూలై 31 (పీపుల్స్ మోటివేషన్):-**

రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన పెట్టుబడులను పెద్ద ఎత్తున ఆకర్షించి తద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రానున్న వంద రోజుల్లో స్నేహపూర్వక పారిశ్రామిక విధానాన్ని రూపొందించనున్నట్లు రాష్ట్ర పారిశ్రామిక, వాణిజ్య మరియు ఆహార శుద్ధి శాఖ మంత్రి టి.జి.భరత్ తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నాల్గో బ్లాక్ పబ్లిసిటీ సెల్ లో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ నేటి ఉదయం రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు పరిశ్రమల శాఖ అధికారులతో సుదీరంగా చర్చించి రాష్ట్రంలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు తీసుకురావాల్సిన నూతన పాలసీలపై పలు ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. గత పదేళ్ల కాలంలో పెట్టుబడుల కోసం వివిధ సందర్భాల్లో చేసుకున్న ఒప్పందాలు, వాటి ప్రస్తుత పరిస్థితిపై అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారన్నారు. వచ్చే 100 రోజుల్లో దేశంలోనే ఉత్తమమైన నూతన ఇండస్ట్రియల్ పాలసీ, ఎంఎస్ఎంఇ పాలసీ, ఫుడ్ ప్రాసె-సింగ్ పాలసీ మరియు ఇండస్ట్రియల్ క్లస్టర్ పాలసీలను తీసుకురావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారన్నారు. వీటికి సంబందించి డ్రాఫ్ట పాలసీలను రానున్న 15 రోజుల్లో రూపొందించి, ఆ డ్రాఫ్ట పాలసీలపై స్టేక్ హోల్డర్లు అందరితో పూర్తి స్థాయిలో చర్చించి దేశంలోనే ఉత్తమైన పాలసీలను రూపొందించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో అపారమైన వనరులు ఉన్నాయని, వాటికి తోడు రాష్ట్రానికి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడే పెద్ద బ్రాండ్ అని, ఆయన మీద ఉన్న అపారమైన విశ్వాసంతో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తరలి వస్తాయనే ఆశాభావాన్ని మంత్రి వ్యక్తం చేశారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడిదారులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఒకే పాయింట్ లో అన్ని అనుమతులు మంజూరు చేసే విధానాన్ని కూడా అమల్లోకి తేనున్నామన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతికి దగ్గర్లో




ఉన్న కృష్ణాజిల్లా మల్లవల్లి పారిశ్రామిక వాడలో తమ ప్రభుత్వ హయాంలో ఎకరం రూ.8 నుండి 16 లక్షల వరకూ ఉంటే, గత ప్రభుత్వం ఆ ధరను రూ.85 నుండి 90 లక్షల వరకూ పెంచడం జరిగిందన్నారు. ఈ పారిశ్రామిక వాడలో భూముల రేట్లు తగ్గించి, పెట్టుబడులకు ఊతం ఇవ్వాలని ముఖ్యమంత్రి అదేశించారని, అందుకు తగ్గట్టుగా కూడా తగు చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా ఇప్పటికే రాష్ట్రంలో ఓర్వకల్లు, కృష్ణపట్నం, ఏపీ బల్క్ డ్రగ్ పార్క్, కొప్పర్తి క్లస్టర్లు ఉన్నాయని, వాటికి అదనంగా నూతనంగా మరో నాలుగు పారిశ్రామిక క్లస్టర్లను కుప్పం, లేపాక్షి సత్యసాయి జిల్లా, శ్రీకాకుళం జిల్లా మూలపేట, ప్రకాశం జిల్లాలోని దొనకొండ లలో అభివృద్ది పర్చాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, రానున్న రోజుల్లో వాటిని కూడా అభివృద్ధి పర్చనున్నట్లు తెలిపారు. రానున్న ఏడాదిలో రూ.1350 కోట్లతో చిత్తూరు నోడ్ ను అభివృద్ది పర్చనున్నట్లు తెలిపారు. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో పిపిపి విధానాన్ని కూడా అమల్లోకి తేనున్నట్లు తెలిపారు. రూ.75 వేల కోట్లు పెట్టుబడులతో బిపిసిఎల్ రాష్ట్రానికి రాబోతున్నదని, అయితే దాన్ని ఎక్కడ పెట్టాలనే విషయాన్ని ముఖ్యమంత్రి 90 రోజుల్లో నిర్ణయించనున్నట్లు తెలిపారు. విన్ ఫాస్ట్ సంస్థ రాష్ట్రంలో ఎలక్ట్రికల్ కార్ల పరిశ్రమ పెట్టాలని ముందుకు వచ్చినా గత ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో తమిళనాడు వెళ్లిపోయారన్నారు. అయితే మా విజ్ఞప్తి మేరకు కృష్ణపట్నంలో బ్యాటరీ పరిశ్రమ ఏర్పాటుకు విన్ ఫాస్ట్ ముందుకు వచ్చిందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన విషయంలో గత ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించిన ఫలితంగా పలు పరిశ్రమలు రాష్ట్రం నుండి తరలిపోయాయన్నారు. రాష్ట్రంలో గత పదేళ్ల కాలంలో దాదాపు రూ.11 లక్షల కోట్లు మేర పెట్టుబడులు పెట్టడం జరిగితే పెద్ద ఎత్తున 2014-19 మద్య కాలంలోనే రూ.7 లక్షల కోట్ల పెట్టుబడులు గ్రౌండ్ అయ్యాయన్నారు. ఏపిఐఐసి భూముల కేటాయింపు విషయంలో 2014-19 మధ్య కాలంలో 14 వేల ఎకరాలు పరిశ్రమలకు కేటాయించడం, ఆ భూముల్లో పరిశ్రమలను కూడా స్థాపించడం జరిగిందన్నారు. అయితే 2019-24 మద్య కాలంలో 6,700 ఎకరాల భూములను కేటాయిస్తే వాటిలో ఎన్ని పరిశ్రమలు స్థాపించారు అనే విషయంలో ఏమాత్రం స్పష్టత లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమలు ఏమీ సరిగా స్థాపించడం జరుగలేదని, సింగిల్ విండో విధానం కూడా సక్రమంగా అమలు కాలేదని, అయితే పేపర్ వర్కు బాగా చేయడం వల్లే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెజ్ లో రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచిందనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వ అధికారులే స్పష్టంచేశారన్నారు. గత పదేళ్ల కాలంలో ఎం.ఎస్.ఎం.ఇ.లకు ప్రోత్సాహకాలను అందజేసే విషయాన్ని పరిశీలిస్తే 2014-19 మధ్య కాలంలో 66 శాతం మేర ప్రోత్సాహకాలను విడుదల చేయడం జరిగితే, గత ప్రభుత్వ హయాంలో కేవలం 34 శాతం ప్రోత్సాహకాలనే విడుదల చేయడం జరిగిందన్నారు. ఎం.ఎస్.ఎం.ఇ., టెక్స్టైల్ రంగాలకు సంభందించి దాదాపు రూ.5 వేల కోట్లు మేర ప్రోత్సాహకాలను చెల్లించాల్సి ఉందని, వచ్చే ఐదేళ్లకు మరో రూ.5 వేల కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ ప్రోత్సాహకాలను అన్నింటిని ఏ విధంగా అయినా చెల్లించేందుకు తగు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి బరోసా ఇచ్చారన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రిన్సిఫల్ సెక్రటరీ ఎన్.యువరాజ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# పల్లె ధవకాన కార్యక్రమం ప్రతి గ్రామంలోఏర్పాటు చేయాలి

**సందర్శించిన జిల్లాప్రోగ్రాం వైద్యాధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి**
**నీళ్ల ట్యాంకు ఎయిర్ కూలర్ల లో పైరిత్రము మందు పిచికారి చేసుకుందాం**
**పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ఇరుగుపొరుగు శ్రద్ధ వహించాలి**

**పెబ్బేరు, జులై 31 (పీపుల్ మోటివేషన్): -**

పెబ్బేరు మండల పరిధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రము పరిధిలో ఏటిగడ్డ శాఖపురంగ్రామంలో మూడో రోజుబుధవారం,కొనసాగుతున్న పల్లె ధవకాన కార్యక్రమ,వైద్య ఆరోగ్య శిబిరము ను సందర్శించిన జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న వైద్య శిబిరంలో జ్వరాలతో ఉన్న ప్రజలను పరీక్షించి వారికి మందులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ జిల్లలో ప్రతి గ్రామాన, ఆంటీ లార్వా ఆపరేషన్ టీమ్,ద్వారా ప్రతి ఇంటికి తిరిగి, పైరిత్రము మందు ఇంటి లోపల పిచికారి చేయించి, ఇంటి బయట ఆబెట్ మందు ద్వారా పాత టైర్లు, సిమెంట్ ట్యాంకులు, డ్రములు, పాత ఎయిర్ కూలర్ లో ఉన్న లార్వాలు చనిపోవడానికి పిచ్చికారి చేయించారు . అనుమానిత జ్వరాలు ఉన్నవాళ్లకి ఐదు మందికి రక్త నమూనాలు సేకరించి, వాటిని వనపర్తి ల్యాబ్ కు పంపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్ర శేఖర్, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, తిరుపతయ్య,జిల్లా ఆంటీ లార్వా సిబ్బంది గంధము రాజు, ఆశ కార్యకర్త లు, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# రిటైర్డ్ తర్వాత ప్రజాసేవకు అంకితం కావాలి

**సమాజంలో అన్నింటికన్నా నిస్వార్థమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి**



**నర్సంపేట, జులై 31 (పీపుల్స్ మోటివేషన్):-**

రిటైర్మెంట్ తర్వాత ప్రజాసేవకు అంకితం కావాలని నర్సంపేట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీలో లీడర్ వేముల సాంబయ్య గౌడ్ అన్నారు. నర్సంపేట పట్టణంలోని జెడ్ పి హెచ్ ఎస్ మోడల్ స్కూల్ ఉపాధ్యాయురాలు ఉదయగిరి ఉమాదేవి పదవి విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శాంతి కుమారి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్ రిటైర్డ్ ఎంఈఓ గండి లింగయ్య గౌడ్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు లు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సమాజంలో అన్నింటికన్నా నిస్వార్ధమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని ఉపాధ్యాయ వృత్తి ఉద్యోగం కాదని సేవ అని,భావి భారత పౌరులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయ వృత్తి అని అన్నారు. అనంతరం ఉమాదేవి దంపతులను శాలువాతో సన్మానించి వారి సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో. డిసిఇబి సెక్రెటరీ పట్టాభి, రమాదేవి, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సదాశివుడు, గర్ల్స్ హై స్కూల్ హెచ్ఎం కాంతారావు, పి ఆర్ టి యు అసోసియేటివ్ అధ్యక్షులు ఉమామహేశ్వర్ , సూచన శ్రీనివాస్ రావు గారు, చెన్నారావుపేట ప్రధానోపాధ్యాయురాలు పాపమ్మ, చెన్నారావుపేట పిఆర్టియు మండల ప్రెసిడెంట్ పూజారి సురేందర్, ప్రధాన కార్యదర్శి భానుమతి, వెంకన్న, పీఏ సీపీఎస్సీయు అధ్యక్షుడు పాత శ్యాంప్రసాద్, ప్రధాన కార్యదర్శి శీలం మల్లయ్య పాల్గొన్నారు.

# హంద్రీ నీవా నీవాకు వెంటనే నీళ్లు వదలాలి

**హైవే కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి : సిపిఎం**



**దేవనకొండ, జూలై 31 (పీపుల్స్ మోటివేషన్):-**

కృష్ణా పరివాహ ప్రాంతాలలో అదేవిధంగా తుంగభద్ర బేసిన్లో కురిసిన వర్షాల వలన ఇప్పటికే కృష్ణ, తుంగభద్ర నదుల మీద ఉన్న ప్రాజెక్టులను నిండి శ్రీశైలం ప్రాజెక్టు కూడా గేట్లు ఎత్తారని అయితే హంద్రీ నివా కు నీళ్ల వదులక పోవడం రాయలసీమ ప్రాంత రైతాంగానికి తీవ్ర నష్టదాయకమని వెంటనే హంద్రీనీవాకు నీళ్ల వదలాలని సిపిఎం పార్టీ జిల్లా నాయకులు బి వీర శేఖర్, ఆ పార్టీ మండల కమిటీ సభ్యులు అశోక్, యూసుఫ్ భాషలు డిమాండ్ చేశారు. బుధవారం నాడు ఈ మేరకు వారు మాట్లాడుతూ ఇప్పటికే శ్రీశైలం రిజర్వాయర్ నుండి గాలేరు నగరి, వెలుగోడు రిజర్వాయర్, మరియు తెలుగంగ తదితర సాగునీటి కాలువలకు నీటిని విడుదల చేసిన ప్రభుత్వం హంద్రీనీవా కు నీళ్ల విడుదల చేయలేదని దీనికి కారణంగా కర్నూలు - గుంటూరు హైవే రోడ్డు మార్గం నిర్మిస్తున్న కాంట్రాక్టర్ బ్రాహ్మణ కొట్కూరు దగ్గర హంద్రీనీవా కాలువపై దారి మళ్లింపు నిర్మాణం చేయడం వలన ఆటంకం ఏర్పడుతుందని అధికారులు చెప్తున్నారని, జూన్ చివరినాటికి రోడ్డు మళ్లింపు నిర్మాణం పూర్తి చేసి నీటిపారుదల శాఖకు అందజేస్తామని హామీ ఇచ్చిన హైవే కాంట్రాక్టర్ తీవ్ర నిర్లక్ష్యం వలన నేటికీ నిర్మాణం పూర్తి కాకుండా హంద్రీనీవా నుండి నీటి విడుదలకు అడ్డంకిగా మారిన నేపథ్యంలో హైవే కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు, రాయలసీమ కరువుకు పరిష్కారంగా ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు దాదాపుగా 35 లక్షల మంది జనాభాకు తాగునీరు సౌకర్యం గల ఈ ప్రాజెక్టు పట్ల ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదని పేర్కొన్నారు,నీటి విడుదల ఒకరోజు ఆలస్యమేనా దాని ప్రభావం రైతంగంపై తీవ్రంగా పడుతుందని ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసి హంద్రీనీవాకు నీటిని విడుదల చేయాలని వారు కోరారు. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ ఆరంభంలో మంచి వర్షాలు పడ్డ జులై మాసంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని పంటలు ఎండిపోయే పరిస్థితికి వచ్చాయని ప్రభుత్వం పరిస్థితిని గమనించి హంద్రీనీవాకు నీటిని విడుదల చేయడం ద్వారా రైతాంగాన్ని ఆదుకోవాలని వారు కోరారు విడుదల చేయకపోతే రైతాంగంతో కలిసి సిపిఎం ఉద్యమిస్తుందని వారు పేర్కొన్నారు.

## ప్రజల ప్రాణాలు అంటే పంచాయతీ అధికారులకు చులకనా..?




**దేవనకొండ, జులై 31 (పీపుల్స్ మోటివేషన్):-**

దేవనకొండ మండల కేంద్రంలో అంబేద్కర్ సర్కిల్ పరిధిలో ఉన్న డ్రైనేజ్ గుంత తెరిచి ఉంచడంతో మంగళవారం సాయంత్ర సమయంలో ఒక కారు నేరుగా వచ్చి డ్రైనేజ్ గుంతలోకి పడిపోయింది. ప్రమాదవశాత్తు కారులో ఉన్న ప్రయాణికులకు ఏమి జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఇలా పలుమార్లు జరిగిన సందర్భాలు ఉన్నాయి. కానీ పంచాయతీ అధికారులు మాత్రం చూస్తూ నిర్లక్ష్యం వహిస్తున్నారు తప్ప వాటికి సంబంధించిన చర్యలు చేపట్టడం లేదు.ఆ డ్రైనేజ్ కాలువ గుంత పూడ్చుండి లేదంటే ఆ గుంతకు ఇరువైపులా ప్రమాదాలకు సంబంధించిన సిగ్నల్స్ ఏర్పాటు చేయండని ప్రజలు ఎన్నిసార్లు పంచాయతీ అధికారులకు వెల్లడించిన పట్టించుకోవటం లేదని వాపోయారు.

## ఉపాధి హామి పనులతో భూగర్భ జలాల పెంపు

**విజయవాడ,జూలై31(పీపుల్స్ మోటివేషన్):**

జాతీయ ఉపాధి హామి పథకం కింద పని కోరిన ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పిస్తున్నామని జిల్లాలో ఉద్యాన రైతుల సౌకర్యార్థం ఉద్యాన తోటలలో 288 పంట కుంటలు నిర్మాణం చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డా. జి. సృజన తెలిపారు.మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం ద్వారా జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో మైలవరం మండలం పుల్లూరు గ్రామ సమీపంలో ఉల్లిబోయిన సోమయ్యకు చెందిన మామిడి తోటలో నిర్మిస్తున్న పంట కుంటను బుధవారం జిల్లా కలెక్టర్ డా.జి.సృజన పరిశీలించారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ సృజన మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామి పథకం ద్వారా పని కోరిన ప్రతి ఒక్కరికి పని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది 82 లక్షల పని దినాలను కల్పించాలన్నది లక్ష్యం కాగా ఇప్పటి వరకు 60 లక్షల పని దినాలను కల్పించడం జరిగిందన్నారు. ఉపాధి హామి పనులలో భాగంగా అమృత సరోవర్ చెరువుల తవ్వకం, పంట కుంటల నిర్మాణం, కందకాల తవ్వకం, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్టక్చర్ల నిర్మాణం, కమ్యూనిటీ సోప్ పిట్ల నిర్మాణం, చెరువు, కాలువ గట్లపై మొక్కల పెంపకం పనులను చేపట్టి కూలీలకు ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు.ఉద్యాన రైతుల సౌకర్యార్థం తోటలలో పంట కుంటల నిర్మాణం చేపట్టామన్నారు. జిల్లాలో 447 పంట కుంటల నిర్మాణానికి అనుమతులు మంజూరు కాగా ఇందులో 288 పంట కుంటల నిర్మాణాన్ని చేపట్టి 80 నిర్మాణాలను పూర్తి చేయడం జరిగిందన్నారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

## డబుల్ బెడ్ రూములను పరిశీలించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని**
**కాంగ్రెస్ ప్రభుత్వానికి డిమాండ్**
**మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి బి ఆర్ఎస్ పార్టీ శ్రేణులు**



**పెబ్బేరు, జులై 31 (పీపుల్స్ మోటివేషన్): -**

పెబ్బేరు మండల పరిధిలోపాతపల్లి, గుమ్మడంలలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, తన హయాములో మంజూర్ చేయించిన బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వమని,పాతపల్లీ 50, గుమ్మడంలో 100 డబల్ బెడ్ ఇండ్లను పరిశీలించారు. నియోజకవర్గంలో గజ్వేల్ తర్వాత మాజీ సీఎం కె. చంద్రశేఖర రావును ఒప్పించి అత్యధిక డబల్ బెడ్ రూమ్స్ మంజూరు చేయించానరు. అందులో భాగంగా గుమ్ముడం100ఇండ్లకు గత ప్రభుత్వంలో పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేయించి కాంట్రాక్టర్ వెంటపడి పూర్తి చేయించామని చిన్న చిన్న మైనర్ పనులు మిగిలిపోయిన దశలో ఉన్నాయని అదేవిధంగా పాతపల్లి గ్రామములో 50ఇండ్లను నిధులు మంజూరు ఇచ్చి స్లాబ్ వరకు పూర్తి చేసామనికాని నేటి ప్రభుత్వం మంజూరు ఉన్న బిల్లులు విడుదల చేయక అలసత్వం చేయడం వల్ల అవి నిరుపయోగంగా మారాయని అన్నారు.ఇట్టి విషయాన్ని తాను మంగళవారం కలెక్టర్ తో భేటీ అయి,డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు,తో సహా వివరించడం జరిగిందని నిరంజన్ రెడ్డి అన్నారు.కాబట్టి వెంటనే ప్రభుత్వం స్పందించి నియోజకవర్గ వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న బిల్లులు మంజూరు చేసిఅసంపూర్తిగా ఉన్న డబల్ బెడ్ రూమ్స్ నిర్మాణాలు పూర్తి చేయాలి అని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న,లబ్ధిదారులు, దిలీప్ రెడ్డి,పాతపల్లీ గోవిందు గ్రామ బి.ఆర్.ఎస్ నాయకులు గ్రామస్తులుపార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

## మాసశివరాత్రి ఎంతో పవిత్రమైనది (ఆధ్యాత్మికం)

**శ్రీకాళహస్తి,జూలై31(పీపుల్స్ మోటివేషన్):**

ప్రతి మాసంలో పవిత్రమైన కృష్ణ పక్షంలోని చతుర్దశి రోజున మాస శివరాత్రిగా జరుపుకుంటారు. ఈ పండుగ శివయ్యకు అంకితం చేయబడింది. శివపార్వతులను ఆరాధించడం, శివరాత్రి రోజున ఉపవాసం చేయడం వలన భక్తులు ఆది దంపతుల నుంచి ప్రత్యేక ఆశీర్వాదాలను పొందుతారని నమ్మకం. అందువల్ల శివపార్వతుల అనుగ్రహం పొందడానికి భక్తులు మాస శివరాత్రిన ప్రత్యేక పూజలు చేస్తారు. రోజంతా ఉపవాసం ఉంటారు. ఈ ఏడాది ఆషాఢ మాస శివరాత్రి ఆగస్టు 2వ తేదీన వచ్చింది. మాస శివరాత్రి ఉపవాసం చాలా ముఖ్యమైనదిగా పరిగణించబడుతుంది. ఈ రోజున ముఖ్యంగా అవివాహితులు శివపార్వతులను వివాహం జరగాలనే కోరికతో పూజిస్తారు. అఖండ సౌభాగ్యం, సంతానం కలగాలని కోరుకుంటూ ఈ ఉపవాసం పాటిస్తారు. ఈ రోజున ఉపవాసం ఉన్న భక్తులకు సుఖం, శాంతి, సౌభాగ్యం లభిస్తాయి. ఈ ప్రత్యేక వ్రతానికి కొన్ని ముఖ్యమైన నియమాలు పాటించాలి. ఆషాడ మాస శివరాత్రి వ్రతాన్ని పాటిస్తున్నట్లయితే.. ఈ రోజున ఏ పనులు తప్పకుండా చేయాలి. మాస శివరాత్రి రోజున తెల్లవారుజామున నిద్రలేచి ఇంటిని బాగా శుభ్రం చేసిన తర్వాత స్నానం చేయడం మొదలైనవి చేయాలి. వీలైతే ఈ రోజున ఉపవాసం పాటించాలి. ఇప్పుడు ఏదైనా శివాలయానికి వెళ్లి ముందుగా వినాయకుడిని స్మరించుకుని దర్శనం చేసుకోండి. అనంతరం గంగాజలంతో శివునికి అభిషేకం చేయాలి. దీని తర్వాత పచ్చి పాలతో అభిషేకం చేయాలి. ఇప్పుడు సాధారణ నీటితో అభిషేకం చేయాలి. దీని కోసం నీటిలో బిల్వ పత్రాన్ని, గంధాన్ని కలిపి శివలింగానికి సమర్పించండి. అంతేకాదు భక్తుల కోరికను అనుసరిస్తూ ఇత్తడి పాత్రలో పాలు, పెరుగు, తేనె, గంగాజలం, నీరు కలిపి పంచామృతాన్ని తయారు చేసి ఈ పంచామృతంతో శివునికి అభిషేకం చేయవచ్చు. అభిషేకం చేస్తున్నప్పుడు ఓం నమః శివాయ మంత్రం లేదా మహామృత్యుంజయ మంత్రాన్ని జపించాలి. మహిళలు పూజ సమయంలో పార్వతీ దేవికి ఆకుపచ్చ రంగు గాజులు, పసుపు, కుంకుమ, జాకెట్టు మొదలైన అలంకరణ వస్తువులను సమర్పించాలి. పార్వతీ దేవికి సింధూరాన్ని నైవేద్యంగా పెట్టిన తర్వాత పెళ్లయిన స్త్రీలు వారి నుదుటిపైన సింధురాన్ని తిలకంగా దిద్దుకోవాలి.

## గోబెల్స్ పత్రికలపై చర్యలు తప్పవు

**జగన్ దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలి**
**మంత్రి కొలుసు పార్థసారథి హెచ్చరిక**

**అమరావతి,జూలై31(పీపుల్స్ మోటివేషన్):**

అబద్దాలు ప్రచారం చేస్తున్న గోబెల్స్ పత్రికలపై చర్యలు తీసుకుంటామని సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి హెచ్చరించారు. జగన్‌కు దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని సవాల్ విసిరారు. ఆగస్టు 1న లబ్దిదారుల ఇంటి వద్దే పింఛను అందిస్తామని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకంపై తప్పుడు రాతలు తగవని హితవు పలికారు. గత ప్రభుత్వం చేతగానితనం వల్లే రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆక్షేపించారు. బిల్లులు చెల్లించకపోవడంతో నాడు చాలా ఆసుపత్రులు ఆరోగ్యశ్రీని నిలిపివేశాయిని గుర్తు చేశారు. పేదలకు వైద్యం అందకుండా చేసిన చేతగాని పాలన జగన్‌ది అని మండిపడ్డారు. కూటమిపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ప్రధాని నరేంద్రమోదీ ఈ రాష్ట్రాభివృద్ధికి, ప్రజారోగ్యానికి కట్టుబడి ఉన్నారని తెలిపారు.

# టీచింగ్ ఫ్యాకల్టీని నియమించండి డీఈడీ విద్యార్థుల ఆందోళన







**వరంగల్/హన్మకొండ, జులై 31 (పీపుల్స్ మోటివేషన్):-**

గత 2 నెలల నుండి టీచింగ్ ఫ్యాకల్టీ లేక ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, పూర్తి కానీ సిలబస్ తో పరీక్షలకు ఎలా సిద్ధం అవ్వాలి అని వరంగల్ డీఈఓ, ప్రస్తుత డైట్ కళాశాల ఇంచార్జ్ (వాసంతి) కి అలాగే డీఈఓ హన్మకొండ అబ్దుల్ కి డీఈడీ మొదటి మరియు రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే టీచింగ్ స్టాఫ్ ని నియమించాలని ఛాత్రోపాధ్యాయులు కోరారు. ఇంకా 22 రోజులు సమయం మాత్రమే ఉండటం వలన రెండవ సంవత్సరం విద్యార్థులకు ఫైనల్ టీచింగ్ - ప్రాక్టికల్స్ అలాగే రెండవ టర్మినల్ జరగలేదు. ఈ 22 రోజుల్లోనే పూర్తి చేయాలి కాబట్టి విద్యార్థులలో ఆందోళన మొదలయింది. కనీసం విద్యార్థులకు హాజరు తీసుకోవడానికి కూడా ఎవరు లేరు. కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి టీచింగ్ ఫ్యాకల్టీ ని నియమించాలని విద్యార్థులు కోరుతున్నారు.

## సబితక్కపై అనుచితంగా మాట్లాడలేదు

**హైదరాబాద్,జూలై31(పీపుల్స్ మోటివేషన్):**

తెలంగాణలో అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా సాగుతున్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మధ్య ఒక మినీ యుద్ధమే నడిచింది. ఈ క్రమంలో.. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో భాగంగా కొన్ని విషయాలను పంచుకున్నారు. మోసం అనే పదానికి ప్రత్యామ్నాయం సబిత అని భట్టి చెప్పారని సీఎం తెలిపారు. సబితక్క కోసం ప్రచారానికి పోతే తన మీద కేసులయ్యాయని సీఎం గుర్తుచేసుకున్నారు. అక్కల మాటలు నమ్మి నేను మోసపోయానని కేటీఆర్‌కు చెప్పానని, వాళ్ళ పేర్లు చెప్పలేదుగా అని అన్నారు. తనను కాంగ్రెస్‌లోకి రమ్మని చెప్పిన సబిత అక్క తనకు అండగా ఉండాల్సింది పోయి పార్టీ మారిందని, తాను మాట్లాడిన దాంట్లో అన్ పార్లమెంట్ భాష లేదని, తాము అసెంబ్లీని డెమోక్రటిక్‌గా నడుపుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఇంకా చాలా విషయాలను సీఎం రేవంత్ రెడ్డి పంచుకున్నారు. ఆ విషయాలు ఆయన సభలో చాలా టైం ఇచ్చినా... అవకాశం ఇవ్వలేదు అంటున్నారు.. సబితక్కకు కూడా మాట్లాడేందుకు అవకాశం ఇచ్చాము.. అక్క వ్యక్తిగతంగా మాట్లాడినందుకే, నేను మిగతాది పూర్తి చేసిన.. కేసీఆర్, హరీష్ ఎందుకు డుమ్మాకొట్టారు... సబితక్క ఇంత ఆవేదన చెందితే కేసీఆర్, హరీష్ రావులు సభలోకి రావాలిగా, మాట్లాడాలి గా.... కేటీఆర్, హరీష్ రావులు మేమే చాలు అన్నప్పుడు, ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్‌ను తీసేయ్యండి.. అసెంబ్లీలో ఇంత చర్చ ఉమ్మడి రాష్ట్రంలో కూడా జరగలేదు... నేను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఎమ్మెల్యేగా ఉన్నాను.. కానీ ఇప్పుడు నడుస్తున్న అసెంబ్లీ డెమొక్రసీగా నడుస్తోంది.. కేంద్ర ప్రభుత్వ బడ్జెకు అనుబంధంగా రాష్ట్ర బడ్జెట్ ఉంటుంది.. సభలో సస్పెన్షన్ ఉండొద్దన్నదే మా ఆలోచన.. అవసరాన్ని బట్టి ఎమ్మెల్యేల సభ్యత్వం కూడా రద్దు కావొచ్చు.. గతంలో కోమటి రెడ్డి, సంపత్ కుమార్ సభ్యత్వాలు రద్దు చేశారు. దేనికైనా సమయం సందర్భాన్ని బట్టి ఉంటుంది.. మేము ఇంకా మార్షల్స్‌ను కూడా వాడటం లేదు.. ఈ మధ్యలో నాతో కలిసి 10 నుంచి 12 మంది బీఆర్ఎస్ ఎమ్యెల్యేలు టీ తాగారు.. కలవడం, టీ తాగడం అనేది రాజకీయాలకు సంబంధం లేదు.. పొత్తులో ఎంతో మంది సీట్లు కోల్పోయారు.. అందులో భాగంగానే సబితక్క కొడుకుకు టికెట్ రాకపోవచ్చు..అని అన్నారు.

## ద్రవ్య వినిమయ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

**హైదరాబాద్,జూలై31(పీపుల్స్ మోటివేషన్):**

తెలంగాణ అసెంబ్లీ ద్రవ్యవినిమియ బిల్లుకు ఆమోదం తెలిపింది. వాదాపవాదాలు, చర్చలు, ఉప చర్చల అనంతరం సభ బిల్లను ఆమోదించింది. తొలుత బిల్లను డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టగా, కెటిఆర్ దీనిపై చర్చ ప్రారంభించారు. తదనంతరం చర్చ పక్కదోవ పట్టి ఉపచర్చలకు దారితీసింది. ఓ దశలో సభలో గందరగోళం ఏర్పడింది. బిఆర్ఎస్ సభ్యులు వెల్‌లో ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో సభ ఆర్డర్‌లో తేవడానికి స్పీకర్ చేసిన యత్నాలు ఫలించలేదు. ఈ క్రమంలో భట్టి బిల్లను ఆమోదించాల్సిందిగా కోరాగా సభ ఆమోదించిన తరవాత శాసనసభ గురువారం నాటికి వాయిదా పడింది. ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం తెలిపిన అనంతరం గురువారం ఉదయం 10 గంటలకు తిరిగి సమావేశం అయ్యేందుకు సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. బుధవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కాగా, ద్రవ్య వినిమయ బిల్లుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ చర్చ ప్రారంభించారు. గత ప్రభుత్వం చేసిన మంచి పనులను మరోసారి గుర్తు చేస్తూ, ఈ ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను ఎత్తిచూపుతూ కేటీఆర్ ప్రసంగం కొనసాగింది. ఇక కేటీఆర్ ప్రసంగానికి అధికార పార్టీకి చెందిన సభ్యులు పలువురు ఘాటుగా సమాదానం ఇచ్చారు. ఇక సభలోకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని ఉద్దేశించి గతంలో ఆమె చేసిన వ్యాఖ్యలకు సమాధానం ఇచ్చే ప్రయత్నం చేశారు. దీంతో సభలో గందరగోళ వాతావరణం నెలకొంది. తనను ఎందుకు టా÷–గ్గ్‌÷ట్ చేస్తున్నారంటూ సబిత సీఎం రేవంత్‌ను నిలదీశారు. ఇక సీఎం మాటలకు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు కూడా వంతపాడారు. గందరగోళ పరిస్థితుల నడుమ సభను పది నిమిషాల పాటు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. మళ్లీ తిరిగి సభ మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ప్రారంభమైంది. సబితా ఇంద్రారెడ్డికి మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ సభ్యులు పట్టుపట్టారు. స్పీకర్ వినిపించుకోకుండా అధికార సభ్యుడు గడ్డం వివేక్‌కు అవకాశం ఇచ్చారు. బీఆర్ఎస్ సభ్యులు స్పీకర్ పోడియంలోకి వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. సబితకు మైక్ ఇచ్చేందుకు సుముఖంగా లేని ప్రభుత్వం.. చివరకు బీజేపీ, ఎంఐఎం, సీపీఐ సభ్యులకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకుండా ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదించుకుంది. అనంతరం సభను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

## యూపిపిఎస్సీ చైర్‌పర్సన్‌గా ప్రీతి సూదాన్

**నేడు బాధ్యతలు స్వీకరించనున్నట్లు వెల్లడి**

**న్యూఢిల్లీ,జూలై31(పీపుల్స్ మోటివేషన్) :**

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నూతన చైర్‌పర్సన్‌గా ప్రీతి సుదాన్ నియమితులయ్యారు. 2025, ఏప్రిల్ 29వ తేదీ వరకు లేకుంటే.. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఆమె ఈ పదవిలో కొనసాగనున్నారు. ప్రస్తుతం యూపీఎస్సీ సభ్యురాలిగా ఆమె కొనసాగుతున్నారు. ఆగస్ట్ 1వ తేదీన గురువారం ఆమె యూపీఎస్సీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. అయితే ఇప్పటి వరకు యూపీఎస్సీ చైర్మన్‌గా ఉన్న మనోజ్ సోని.. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. దీంతో కొత్త యూపీఎస్సీ చైర్మన్ నియామకం అనివార్యమైంది. ఇటీవల వరకు యూపీఎస్సీ చైర్మన్‌గా గుజరాత్‌కు చెందిన మనోజ్ సోని ఉన్నారు. 2029 ఏడాది చివర వరకు ఆయన ఆ పదవిలో కొనసాగవలసి ఉంది. కానీ వ్యక్తిగత కారణాలతో ఆయన ఆ పదవికి రాజీనామా చేశారు. మరోవైపు ఆ కొద్ది రోజుల ముందే.. మహారాష్ట్రలోని పుణె ట్రైయినీ కలెక్టర్ పూజా ఖేద్కర్ వ్యవహార శైలి వివాదాస్పదంగా మారింది. దానితోపాటు ఆమె దివ్యాంగుల కోటాలో ఐఏఎస్ పదవికి ఎంపికయ్యారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. సరిగ్గా అలాంటి వేళ యూపీఎస్సీ చైర్మన్ పదవికి మనోజ్ సోని రాజీనామా చేశారు. దీంతో ఆయన రాజీనామా రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే పూజా ఖేద్కర్ అంశానికి మనోజ్ సోని రాజీనామాకు ఎటువంటి సంబంధం లేదని ఇప్పటికే కేంద్రం స్పష్టత ఇచ్చింది. అదీకాక మనోజ్ సోని.. ప్రధాని మోదీకి అత్యంత సన్నిహితుడనే ఓ ప్రచారం సైతం సాగుతుంది. 1983, బ్యాచ్ ఐఏఎస్ అధికారి.. ప్రీతి సుదాన్. ఇక ప్రీతి సుదాన్ భర్త రణదీప్ సుదాన్ సైతం ఐఏఎస్ అధికారే. వీరిద్దరు ఆంధ్రప్రదేశ్ కేడర్ ఐఏఎస్‌లు. ఉమ్మడి ఏపీలోని వివిధ జిల్లాలకు వీరిద్దరు కలెక్టర్లుగా పని చేసిన విషయం విదితమే.

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

గురువారం । ఆగస్టు । 1 । 2024



# ఏపికి క్యూ కడుతున్న పారిశ్రామిక వేత్తలు

**దేశంలోనే ఉత్తమ పారిశ్రామిక విధానం**

**అధికారులతో సిఎం చంద్రబాబు సమీక్ష**

**వివరాలు వెల్లడించిన మంత్రి భరత్**



**అమరావతి,జూలై31(పీపుల్స్ మోటివేషన్):**

ఆంధ్రప్రదేశ్‌లో దేశంలోనే ఉత్తమ పారిశ్రామక విధానాన్ని తీసుకురానున్నామని ఏపీ పరిశ్రమశాఖ మంత్రి టిజి భరత్ వెల్లడించారు. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమీక్ష నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 2014-19 వరకు చంద్రబాబు హయాంలో ఏపీలో పారిశ్రామిక విధానాన్నికి ఆకర్షితులైన అనేక మంది పారిశ్రామిక వేత్తలు పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చారని వివరించారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఐదేండ్లలో పరిశ్రమల ఏర్పాట్లకు ఫ్రెండ్లీ వాతావరణం కల్పించలేకపోయారని ఆరోపించారు. గతంలో పెట్టుబడులకు పారిశ్రామక వేత్తలు భయపడే పరిస్థితి ఉండేదని ఆరోపించారు. రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లో పారిశ్రామికి క్లస్టర్లు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు సూచించారని వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్, ఇండస్ట్రియల్ పాలసీ, ఎంఎస్‌ఎంఈ , క్లస్టర్ పాలసీని 45 రోజుల్లో తీసుకురానున్నామని తెలిపారు. ఏపీలో సహజ సిద్ధమైన వనరులున్నాయని, వాటిని వినియోగించుకుని ముందుకు వెళ్తామని వివరించారు. మల్లవల్లి పారిశ్రామికవాడలో భూముల ధరల తగ్గింపుపై చర్చ జరిగిందన్నారు. ప్రస్తుతం ఓర్వకల్లు, కృష్ణపట్నం, ఏపి బల్క్‌డ్రగ్ పార్క్, కడప జిల్ల కొప్పర్తిలో క్లస్టర్లున్నాయని తెలిపారు. కొత్తగా కుప్పం, లేపాక్షి, శ్రీకాకుళం జిల్లా మొల్లపేట, ప్రకాశం జిల్లా దోనకొండలో పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేయనున్నామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెట్టుబడిదారులు, పారిశ్రామిక వేత్తలు ఏపీకి క్యూ కడుతున్నారని వెల్లడించారు. సుమారు 75 వేల కోట్ల రూపాయల వ్యయం కాగల బీపీసీఎల్ ఇండస్ట్రీ ఏపీకి రాబోతుందని వివరించారు. అంతకుముందు పరిశ్రమల శాఖపై సీఎం చంద్రబాబునాయుడు సమీక్ష నిర్వహించారు. గత 5 ఏళ్ల కాలంలో పరిశ్రమల శాఖ పనితీరుపై సమీక్ష చేశారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఒప్పందం చేసుకున్న పారిశ్రామిక వేత్తలు వైసీపీ ప్రభుత్వంలో వెనక్కి వెళ్లారని అధికారులు తెలిపారు. ప్రభుత్వం సహకరించకపోవడం, వివిధ కారణాలతో వేధింపులకు పాల్పడడంతో భూ కేటాయింపులు జరిగిన తరువాత కూడా పలు కంపెనీలు వెళ్లిపోయాయన్నారు. ఇండస్ట్రీ కోసం కేటాయించిన భూముల కబ్జాలతో పాటు..అధికార దుర్వినియోగం జరిగిందని అధికారులు అంగీకరించారు. రాష్ట్రం నుంచి విడిచిపోయిన కంపెనీలను తిరిగి రప్పించేందుకు గట్టిగా ప్రయత్నాలు చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పారిశ్రామిక వేత్తల్లో తిరిగి నమ్మకాన్ని కల్పించేందుకు స్వయంగా తాను మాట్లాడుతానని సీఎం చంద్రబాబు తెలిపారు. ఆయా జిల్లాల్లో ఉన్న భూముల లభ్యత.. ఏపి ప్రాంతాలు ఇండస్ట్రియల్ క్లస్టర్స్‌కు అనుకూలం అనే అంశాలపై చర్చ జరిగింది. మంత్రులు టిడి భరత్, కొండపల్లి శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.

## ఏపిలో భారీగా డిఎస్పీల బదిలీలు

**వైకాపాతో కొమ్ముకాసిన వారికి నిరాశ**




**అమరావతి,జూలై31(పీపుల్స్ మోటివేషన్):**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏకంగా 96 మంది డీఎస్పీలను బదిలీ చేసింది. ఈ మేరకు డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా గత ఐదేళ్లపాటు అరాచకానికి పాల్పడ్డ వైసీపీతో అంటకాగిన పలువురు డీఎస్పీలకు ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇవ్వలేదు. వారందరినీ డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని డీజీపీ ఆదేశించారు. కాగా ఆంధప్రదేశ్‌లో ఏర్పడిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సుపరిపాలనపై దృష్టిసారించింది. అందులో భాగంగా అధికారుల స్థానచలనంపై దృష్టిసారించింది. అన్ని శాఖల్లో బదిలీలు చేపడుతున్న ప్రభుత్వం తాజాగా పోలీసు శాఖలో ఏకంగా 96 మంది డీఎస్పీలను బదిలీ చేసింది.కాగా గత వైసీపీ ప్రభుత్వంతో అంటకాగిన పలువురు డీఎస్పీలపై బదిలీ వేటు పడింది. తాడిపత్రి, రాజంపేటలో వైసీపీ కోసం పనిచేసిన డీఎస్పీ చైతన్యను బదిలీ చేశారు. డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించిన అధికారుల జాబితాలో ఆయన పేరుంది. తాడిపత్రిలో జేసీ ప్రభాకర రెడ్డి, ఆయన అనుచరులను డీఎస్పీ చైతన్య తీవ్రంగా వేధించిన విషయం తెలిసిందే. రాజంపేటకు బదిలీ అయినా సరే తాడిపత్రికి వచ్చి జేసీ ప్రభాకర్ రెడ్డి అనుచరులపై దాడి చేశారని చైతన్యపై అభియోగాలు ఉన్నాయి. రాజంపేటలో కూడా వైసీపీ కోసం డీఎస్పీ చైతన్య పని చేశారని, తుళ్లూరు డీఎస్పీ అశోక్ కుమార్ గౌడ్ బదిలీ అయ్యారు. పోస్టింగ్ ఇవ్వకుండా డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

## చంద్రబాబుతోనే కుప్పం అభివృద్ధి

**ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ వెల్లడి**

**అమరావతి,జూలై31(పీపుల్స్ మోటివేషన్):**

ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో కుప్పం వైసీపీ నేతలు.. టీడీపీలో చేరారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో చంద్రబాబు సమక్షంలో కుప్పం మున్సిపాలిటీకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లు, 15 మంది ఎంపీటీసీలు టీడీపీలో చేరారు. కుప్పం అభివృద్ధి చెందాలంటే అది చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని వైసీపీ నేతలు అన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. త్వరలోనే కుప్పం నియోజకవర్గానికి చెందిన మరికొందరు వైసీపీ కీలక నేతలు టీడీపీలో చేరబోతున్నార న్నారు. గత ఐదు సంవత్సరాలుగా కుప్పంలో ఎలాంటి అరాచకాలు చోటుచేసుకున్నాయో అందరికీ తెలుసన్నారు. కుప్పంలో వైసీపీ అవినీతి అరాచకాలపై విచారణ జరుగుతుందని శ్రీకాంత్ తెలిపారు. కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి సీఎం చంద్రబాబు రూ. 250 కోట్లు కేటాయించారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీనివాస్ తెలిపారు. హంద్రీనీవా కాలువ ద్వారా వచ్చే నీటిని నిలువ చేయడానికి 500 కోట్లతో రిజర్వాయర్లు నిర్మిస్తున్నామన్నారు. కుప్పంలో 2000 ఎకరాలతో సెజ్ ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన 40 రోజుల్లోనే కుప్పం అభివృద్ధికి చంద్రబాబు నిధులు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. ఎవరైతే తటస్థులుగా ఉండి కుప్పం అభివృద్ధిని కోరుకుంటున్నారో వారందరినీ టీడీపీలోకి ఆహ్వానిస్తామని కంచర్ల శ్రీకాంత్ వెల్లడించారు.

## ఇరిగేషన్ పనుల్లో 200కోట్ల అవినీతి

**ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి**

**నెల్లూరు,జూలై31(పీపుల్స్ మోటివేషన్):**

గత వైసీపీ ప్రభుత్వంలో సర్వేపల్లి నియోజకవర్గంలో ఇరిగేషన్ పనులకు సంబంధించి రూ.200కోట్ల అవినీతి జరిగినట్లు ఎమ్మెల్యే, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆరోపించారు. వైసీపీ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ ప్రాతినిధ్యం వహించిన సర్వేపల్లిలో పెద్దఎత్తున కుంభకోణం జరిగిందని ఆయన అన్నారు. నీటిపారుదల శాఖ పనులకు సంబంధించి ఒక్క పనీ చేయకుండానే కోట్లలో నిధులు స్వాహా చేశారని సోమిరెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా అక్కంపేట, వీరంపల్లి ప్రాంతాల్లోని పలు ఇరిగేషన్ పనులను ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పరిశీలించారు. గత ఐదేళ్ల పాలనలో ఒకే పనికి ఒక్కో ఏడాది వేర్వేరుగా బిల్లులు పెట్టి నిధులు స్వాహా చేశారని ఆయన ఆరోపించారు. ఒక్క పార మట్టి తీయకుండా, ఒక్క చెట్టు కొట్టకుండానే బిల్లులు చేసుకున్నారని మండిపడ్డారు. 5ప్యాకేజీల పేరుతో మాజీ మంత్రి కాకాణి లెఫ్ట్, రైట్ నిధులు దోచుకున్నారని సోమిరెడ్డి ఆరోపించారు. పనులు చేయకుండానే బిల్లులు చేయాలని కాకాణి తమ గొంతుపై కత్తిపెట్టి బెదిరిస్తేనే తాము ఆ పని చేసినట్లు అధికారులు చెబుతున్నారని సోమిరెడ్డి చెప్పారు. వైసీపీ హయాంలో తన మాట వినని ఓ అధికారిని ఆయన శ్రీకాకుళం బదిలీ చేశారని, మిగిలిన వారినీ శ్రీకాకుళం వెళ్తారా అంటూ బెదిరించినట్లు ఎమ్మెల్యే ఆరోపించారు. తప్పు ఎవరు చేసినా తప్పే, ఎవ్వరినీ వదిలేది లేదని సోమిరెడ్డి హెచ్చరించారు.ఏపీలో వైసీపీ పాపాలకి రైతులు మూడు లక్షల ఎకరాల్లో మొదటి పంట పండిచుకోలేకపోయారని ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. ఏపీలో జగన్ ఇసుక, మద్యం, ఖనిజాలు దోచుకుంటే మంత్రులు, ఎమ్మెల్యేలు స్థానికంగా అవినీతికి పాల్పడ్డారని అన్నారు. సర్వేపల్లిలో జరిగిన అక్రమాలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సర్వేపల్లిలో అవినీతిపై కచ్చితంగా విచారణ చేస్తామని, అక్రమార్కులు ఎంతటి వారైనా వదిలేది లేదని ఎమ్మెల్యే సోమిరెడ్డి హెచ్చరించారు.



## రాజకీయ చర్చలతో దద్దరిల్లిన అసెంబ్లీ

**ఫిరాయింపులపై సబితతో ఫిర్యాదును ప్రస్తావించిన సీతక్క**

**తనను టార్గెట్ చేస్తున్నారంటూ సబిత ఆగ్రహం**

**సబిత మోసం చేసింది నిజమే అన్న సిఎం రేవత్**

**కాంగ్రెస్‌ను మోసం చేసిన ఘనత మీదే అన్న భట్టి**

**దళితుడు విపక్షనేత కాకుండా చేశారని ఆగ్రహం**

**హైదరాబాద్,జూలై31(పీపుల్స్ మోటివేషన్) :**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో మాటల యుద్ధంతో ద్దరిల్లింది. ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చలో రాజకీయాలుఎ చోటు చేసుకున్నాయి. మొదట.. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ వర్సెస్ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులుగా సుమారు గంటకుపైగానే సభ నడవగా ఆ తర్వాత ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రస్తావన వచ్చింది. సభలో పార్టీ మార్పులపై వాడి వేడిగా చర్చ నడుస్తుండగా పెద్ద రచ్చే అయ్యింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం ఇద్దరూ కౌంటర్ల వర్షం కురిపించారు.మంత్రి సీతక్క భారాసపై ఘాటు విమర్శలు చేశారు. కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని భారాస నేతలు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఆ ఫిర్యాదు పత్రాన్ని కాంగ్రెస్‌లో గెలిచి భారాసలోకి వచ్చిన సబితా ఇంద్రారెడ్డితో ఇప్పించారని ఎద్దేవా చేశారు. భారాస వాళ్లు రాజీనామా చేయించి ఎమ్మెల్యేలను చేర్చుకున్నారా అని ప్రశ్నించారు. ఈక్రమంలో సబితా ఇంద్రారెడ్డి స్పందించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు తనను టార్గెట్ చేస్తున్నారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డిని.. ఓ అక్కగా కాంగ్రెస్‌లోకి సంతోషంగా ఆహ్వానించినట్లు గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డికి నాపై ఎందుకు కక్ష?. ఆరోజు పార్టీలోకి వచ్చినప్పుడు కాంగ్రెస్ ఆశాకిరణం అవుతావని చెప్పాను. సీఎం అవుతావని కూడా చెప్పాను. మనస్ఫూర్తిగా ఆశీర్వదించాను అని తెలిపారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సబితక్క నన్ను పార్టీలోకి ఆహ్వానించిన మాట వాస్తవం. వ్యక్తిగతంగా జరిగిన సంభాషణ సభలో చెప్పారు. సబిత సభలో ప్రస్తావించారు కాబట్టే.. అప్పుడు జరిగిన పరిణామాలు సభలో చెప్పాలి. 2019లో మల్కాజిగిరిలో పోటీ చేయాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. మల్కాజిగిరి నుంచి పోటీ చేస్తే అండగా ఉంటానని సబితక్క మాట ఇచ్చారు. కాంగ్రెస్ నన్ను అభ్యర్థిగా ప్రకటించిన వెంటనే ఆమె భారాసలో చేరారు. అధికారం కోసం కాంగ్రెస్‌ను వదిలి భారాసలో చేరి మంత్రి పదవి తీసుకున్నారు. తమ్ముడిగా నన్ను మోసం చేశారు కాబట్టే ఆమెను నమ్మవద్దని కేటీఆర్‌కు చెప్పా. మల్కాజిగిరి నుంచి పోటీ చేస్తే గెలిపించే బాధ్యత నాదే అని సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. నేను చెప్పింది నిజమో.. కాదో.. సబితక్క గుండె మీద చేయి వేసుకుని చెప్పాలని రేవంత్ చెప్పారు. ఈ క్రమంలో కేటీఆర్ వెనకాల ఉన్న అక్కల మాట వినొద్దని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అభ్యంతరం తెలిపారు. వెల్ లోకి దూసుకొచ్చి ఆందోళన చేశారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి ఏ పార్టీ నుంచి ఏ పార్టీలోకి వచ్చారని సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. రేవంత్ రెడ్డిని తమ్ముడిగా పార్టీలోకి ఆహ్వానించానన్నారు. సీఎం రేవంత్ పదే పదే ఎందుకు టార్గెట్ చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే స్పీకర్ కలుగజేసుకుని సభా నాయకుడిని అగౌరవ పరుస్తున్నారని సబితకు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. డిప్యూటీ సీఎం భట్టీ విక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్‌లో సబితా అనుభవించిన పదవులు మొత్తం అన్నీ ప్రస్తావించారు. '2004 నుంచి 2009 వరకు కాంగ్రెస్ పార్టీ సబితా ఇంద్రారెడ్డికి అనేక పదవులు ఇచ్చింది. కానీ.. సబితా ఇంద్రారెడ్డి పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరి మోసం చేశారు. ఒక దశాబ్ద కాలం సబితకి మంత్రి పదవి ఇచ్చాం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకుంటే సబిత బీఆర్ఎస్‌లోకి వెళ్ళారు. కాంగ్రెస్ నన్ను సీఎల్పీ లీడర్ చేస్తే నా వెనక ఉండాల్సింది పోయి పదవి కోసం సబిత పార్టీ మారారు. ఓ దళితుడికి ప్రతిపక్ష నేత హోదా లేకుండా చేసేందుకు సబిత పార్టీ పదవి వెళ్లారు. పార్టీలు మారి, ప్రజాస్వామ్యాన్ని కూని చేసింది గాక ఇప్పుడు ఏదో మాట్లాడుతున్నారు. అసలు సబిత ఎందుకు బాధపడుతున్నారో అర్థం కావడం లేదు' అని భట్టీ ప్రశ్నలు, అంతకుమించి విమర్శల వర్షం కురిపించారు. ఈ క్రమంలోనే స్పీకర్ ఒకింత ఆగ్రహానికి లోనయ్యారు. 'కేటీఆర్ గారు రెచ్చగొట్టడమే మన పనా..?' అంటూ కోపంగా స్పీకర్ మాట్లాడారు. చర్చ పక్కదోవ పట్టడంతో స్పీకర్ సభను వాయిదా వేశారు.

## ధరల స్థిరీకరణపై ప్రభుత్వం దృష్టి

**బియ్యం, కందిపప్పుల ధరలు స్వల్పంగా తగ్గింపు**

**అమరావతి,జూలై31(పీపుల్స్ మోటివేషన్):**

ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వం ధరల స్థిరీకరణపై దృష్టిసారించింది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వరుసగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా నిత్యావసరాలైన బియ్యం, కందిపప్పు, స్టీమ్డ్ రైస్ ధరల తగ్గింపుపై దృష్టిసారించారు. ఇటీవలే వ్యాపారులతో మంత్రి సమావేశమయ్యారు. బియ్యం, కందిపప్పు ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. బ్లాక్ మార్కెట్ వంటి చర్యలకు పాల్పడవద్దని, సామాన్య జనాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకి సామాన్యులు విలవిల్లాడుతున్న వేళ ప్రభుత్వం ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. నిత్యావసరాలైన బియ్యం, కందిపప్పు, స్టీమ్డ్ బియ్యం ధరలను మరో దఫా తగ్గించాలని నిర్ణయించింది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కీలక ప్రకటన చేశారు. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కిలో ధర రూ.160గా ఉండగా దానిని రూ.150కి తగ్గిస్తున్నామని ప్రకటించారు. ఇక బియ్యం ధరను రూ.48 నుంచి రూ.47కి స్వల్పంగా తగ్గిస్తున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా బుధవారం స్పందించారు. తగ్గించిన ధరలతో రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయనున్నామని, గురువారం నుంచి విక్రయిస్తారని మంత్రి నాదెండ్ల మనోహర్ క్లారిటీ ఇచ్చారు. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్లను ఆదేశించామని నాదెండ్ల మనోహర్ వివరించారు. రాష్ట్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఈ నెల రోజుల వ్యవధిలో బియ్యం, కంది పప్పు ధరలను రెండుసార్లు తగ్గించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని ఆయన ప్రస్తావించారు. ధరల స్థిరీకరణలో భాగంగా ఇటీవల కూడా బియ్యం, కందిపప్పు ధరలను స్వల్పంగా తగ్గించారు. ఈ నెల 11 నుంచి రైతు బజార్లలో కిలో కందిపప్పు ధర బహిరంగ మార్కెట్‌లో రూ.180 ఉండగా రూ.160కి, స్టీమ్డ్ రైస్ కేజీ రూ.55.85 నుంచి రూ.49కి, ముడి బియ్యం కేజీ రూ.52.40 నుంచి రూ.48కి తగ్గించారు.

## నేడు శ్రీశైలంలో సిఎం చంద్రబాబు పర్యటన

**కృష్ణమ్మకు జలహారతి ఇవ్వనున్న సిఎం**

**నంద్యాల,జూలై31(పీపుల్స్ మోటివేషన్):**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం శ్రీశైలంలో పర్యటించనున్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కృష్ణమమకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. నల్లమల శ్రీశైలం అడవులను గ్రేహౌండ్స్, బాంబుస్క్వాడ్, స్పెషల్ పార్టీ పోలీసులు జల్లెడ పడుతున్నారు. శ్రీశైలం ఆలయం, జలాశయం వద్ద ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రానా పరిశీలించారు. అనంతరం సుండిపెంట ప్రజావేదిక, హెలిప్యాడ్ ప్రాంతాలను వారు పరిశీలించారు. హెలిప్యాడ్ వద్ద బాంబు, డాగ్ స్క్వాడ్లతో పోలీసులు సైతం ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. సీఎం పర్యటన విజయవంతం అయ్యేలా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అన్ని శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గురువారం ఉదయం 9:50గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు సున్నిపెంట హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం స్వామిఅమ్మవార్లను దర్శించుకుంటారు. శ్రీశైల ప్రాజెక్టు వద్ద జలహారతి కార్యక్రమాన్ని చంద్రబాబు నిర్వహిస్తారు. తర్వాత కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శిస్తారు. అనంతరం సున్నిపెంట వాటర్ యూజర్స్ అసోసియేషన్ సభ్యులతో సీఎం ముఖాముఖి చర్చాగోష్టి నిర్వహిస్తారు. అనంతరం తిరుగు ప్రయాణం అవుతారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం

**ప్రమాణం చేయించిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే**

**హైదరాబాద్,జూలై31(పీపుల్స్ మోటివేషన్):**

తెలంగాణ నూతన గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే.. ఆయనతో ప్రమాణం చేయించారు. రాజ్‌భవన్‌లో జరిగిన గవర్నర్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, సీఎస్ శాంతి కుమారి తదితరులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకార అనంతరం సిఎం రేవంత్ రెడ్డి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. అనంతరం మంత్రులు, పలువురు నేతలు అభినందనలు తెలిపారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. తరవాత గవర్నర్‌తో సిఎం, మంత్రులు గ్రూప్ ఫోటో దిగారు. ఆ తదుపరి హై టీలో విఐపిలు పాల్గొన్నారు. 1957 ఆగస్టు 15న జన్మించిన జిష్ణుదేవ్ వర్మ.. త్రిపుర రెండో ఉప ముఖ్యమంత్రిగా 2018 నుంచి 2023 వరకు పని చేశారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగానూ సేవలందించారు. ఆయన త్రిపుర రాజ కుటుంబానికి చెందిన వ్యక్తి. రామ జన్మభూమి ఉద్యమ సమయంలో 1990లో భాజపాలో చేరారు. తెలంగాణ భాజపా నేత ఇంద్రసేనారెడ్డి త్రిపుర గవర్నర్‌గా నియమితులుకాగా, ఆ రాష్ట్రానికి చెందిన నాయకుడు తెలంగాణ గవర్నర్‌గా రావడం విశేషం.



# జీఎస్టీ వాతలపై గళం విప్పిన గడ్కరీ

**జనరల్, హెల్త్ ఇన్సూరెన్స్‌లపై 18శాతం జిఎస్టీయా?**
**ఇది వ్యక్తి కష్టం, ఆరోగ్యాలపై పన్ను విధించడమే**
**వెంటనే దృష్టి సారించాలంటూ నిర్మలా సీతారామన్‌కు లేఖ**

**న్యూఢిల్లీ,జూలై31(పీపుల్స్ మోటివేషన్):**

జిఎస్టీ వాతలపై ఇంతకాలం విపక్షాలు ప్రస్తావిస్తూ రాగా..తొలిసారిగా అధికార పక్షంలోనూ చర్చ మొదలయ్యింది. ఈ విషయంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తొలిసారి పెదవి విప్పారు. ఇవేమి వాతలంటూ ఆర్థికమంత్రి దృష్టికి తెచ్చే ప్రయత్నం చేశారు. పేద, మధ్య తరగతి ప్రజలు చెల్లిస్తున్న జీవిత, వైద్య బీమా ప్రీమియంలపై 18 శాతం వస్తు సేవల పన్ను జిఎస్టీని ఉపసంహరించుకోవాలని కోరుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ లేఖ రాశారు. లైఫ్, మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై 18 శాతం జిఎస్‌టిని తగ్గించాలని ఆ లేఖలో కోరారు. ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై పన్ను విధించడం అంటే.. ఒక వ్యక్తి కష్టం, అనారోగ్యం పై పన్ను విధించినట్లేనని తెలిపారు. అదే విధంగా వైద్య బీమా ప్రీమియం రంగంపై 18 శాతం జిఎస్‌టి తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశం ఉందన్నారు. జీవిత, వైద్య బీమా ప్రీమియంపై జీఎస్టీ చెల్లించడం సీనియర్ సిటిజన్లకు పెద్ద సవాలుతో కూడుకున్నదని తెలిపారు. ఈ అంశంపై పునరాలోచించుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీమా పరిశ్రమకు సంబంధించిన సమస్యలపై నాగ్‌పూర్ డివిజనల్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ తనకు మెమోరాండం సమర్పించిందని లేఖలో పేర్కొన్నారు. కాగా... ఆరోగ్య బీమా ప్రీమియంలపై జీఎస్టీని పునపరిశీలించాలని నిర్మలా సీతారామన్‌కు గతంలో పలు మార్లు అభ్యర్థనలు వచ్చాయి. వ్యక్తిగత ఆరోగ్య పాలసీలపై జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని ఈ ఏడాది జూన్‌లో కాన్ఫెడరేషన్ ఆఫ్ జనరల్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సామాజిక భద్రతకు కొలమానంగా ఈ పాలసీలను కొనుగోలు చేసేలా ప్రజలను ప్రోత్సహించడంలో మీరు చేసే తగ్గింపు సహాయపడుతుందని నాన్-లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ల సంఘం తెలిపింది. పెరిగిన పన్నుల రీత్యా గత 5 సంవత్సరాలలో ఆరోగ్య బీమా ప్రీమియం దాదాపు రెండింతలు పెరిగిందని.. దీంతో పాలసీలు తీసుకునేవారి సంఖ్య గణనీయంగా పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. కొంతమంది ఆరోగ్య బీమా పాలసీలు తీసుకున్నా మళ్లీ రెన్యువల్ చేసుకోవడం లేదని.. రెన్యువల్ చేసుకున్న వారు 65 నుంచి 75 శాతం వరకే ఉంటుందని పేర్కొంది. బీమా ప్రీమియంలను తరచుగా పెంచడం, ఎక్కువ జీఎస్‌టీ రేటు కారణంగా చాలా మంది పాలసీదారులు ప్రీమియం చెల్లించలేకపోతున్నారని సంఘం పేర్కొంది.

# హమాస్‌కు భారీ ఎదురుదెబ్బ

**సంస్థ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్య**
**ఇరాన్‌లో గార్డుతో సహా హనియాను కాల్చిన దుండగులు**

**టెహ్రాన్,జూలై31(పీపుల్స్ మోటివేషన్) :**

గత కొన్ని నెలలుగా ఇజ్రాయెల్‌తో పోరాటం చేస్తున్న హమాస్ కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ సంస్థ చీఫ్ ఇస్మాయిల్ హనియా (62) ఇరాన్‌లో హత్యకు గురయ్యాడు. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వ మీడియా సంస్థ ప్రెస్ టీవీ బుధవారం ప్రకటించింది. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్‌ను ఉటంకిస్తూ ఈ కథనం ప్రసారం చేసింది. మరోవైపు హమాస్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. దీనిని ఇజ్రాయెల్ దాడిగా అభివర్ణించింది. టెహ్రాన్‌లోని ఇంటి వద్ద జరిగిన దాడిలో హనియా, ఆయన బాడీగార్డ్ మృతి చెందినట్లు పేర్కొంది. ఆయన ఇరాన్ నూతన అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరై ఇంటికి వచ్చిన తర్వాత దాడి జరిగినట్లు చెబుతున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు మొదలైంది. హనియా మరణంపై హమాస్ పొలిటికల్ బ్యూరో సభ్యుడు మూసా అబు మర్జుక్ ఓ ప్రకటన విడుదల చేశాడు. ఇది కుట్రపూరిత చర్య. దీనికి బదులు తప్పదు అంటూ ఇజ్రాయెల్‌పై ప్రతీకార హెచ్చరికలు చేశాడు. ఇజ్రాయెల్ వైమానిక దాడిలోనే తమ చీఫ్ మృతి చెందాడని హమాస్ ఆరోపించింది. అటు ఈ హత్య ఘటనను పాలస్తీనా అధ్యక్షుడు అబ్బాస్ తీవ్రంగా ఖండించారు. హనియా మృతి వార్తల కథనాలను అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ తెలుసుకుంది. అయితే, వాటిపై స్పందించేందుకు మాత్రం శ్వేతసౌధం అధికార ప్రతినిధి నిరాకరించారు. మరోవైపు ఇజ్రాయెల్ మాత్రం ఈ ఘటనపై ఎటువంటి ప్రకటన చేయాలేదు. హనియా 1963లో గాజా సిటీకి సమీపంలోని ఓ శరణార్థి శిబిరంలో జన్మించాడు. 1980ల చివర్లో తొలి ఇంతిఫాదా సమయంలో హమాస్‌లో చేరాడు. 1990లో తొలిసారిగా హనియా పేరు వెలుగులోకి వచ్చింది. హమాస్ వ్యవస్థాపకుడు అహ్మద్ యాసిన్‌కు ఇతడు అత్యంత సన్నిహితుడు. రాజకీయపరమైన సలహాలిస్తూ ఆయనకు కుడి భుజంగా మారాడు. అంచెలంచెలుగా ఎదుగుతూ సంస్థలో అనేక ర్యాంక్‌లు చేపట్టాడు. 2004లో ఇజ్రాయెల్ దాడుల్లో అహ్మద్ యాసిన్ హతమైన తర్వాత.. హమాస్‌లో కీలక పాత్ర పోషించాడు. 2006లో పాలస్తీనా స్టేట్ ప్రధానిగా ఎంపికై గాజా పట్టీని పాలించాడు. అయితే, 2007 జూన్‌లో పాలస్తీనా నేషనల్ అథారిటీ అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ అతడిని పదవి నుంచి తొలగించారు. నాటి నుంచి గాజాలో ఫతా-హమాస్ యుద్ధం జరుగుతోంది. దీంతో అబ్బాస్ ఆదేశాలను పక్కనపెట్టి గాజాలో ప్రధాని బాధ్యతల్లో కొనసాగాడు. 2017 హమాచ్ చీఫ్‌గా ఎన్నికయ్యాడు. ఆ తర్వాత అమెరికా అతడిని ప్రపంచ ఉగ్రవాదుల జాబితాలో చేర్చింది. 2019లో గాజా పట్టిని వీడి అప్పటి నుంచి ఖతర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో హనియా ముగ్గురు కుమారులు, నలుగురు మనవళ్లు, మనవరాళ్లు మరణించినట్లు అప్పట్లో హమాస్ ప్రకటించింది. కుటుంబసభ్యులను కోల్పోయినా ఇజ్రాయెల్‌పై పోరాటం ఆగద్దొని అప్పట్లో హనియా చెప్పినట్లు తెలిసింది. బందీల విడుదల, గాజాలో కాల్పుల విరమణ ఒప్పందాల్లో ఇతడు కీలకంగా వ్యవహరించాడు.

# వివాదాస్పద ప్రొబేషనరీ పూజా ఖేడ్కర్ పై వేటు

**ఐఎఎస్‌ను రద్దు చేస్తూ యూపిపిఎస్సీ ఆదేశాలు**
**ఎలాంటి పరీక్షలకు హాజరు కాకుండా నిషేధం**



**న్యూఢిల్లీ,జూలై31(పీపుల్స్ మోటివేషన్):**

మహారాష్ట్రకు చెందిన వివాదాస్పద ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేడ్కర్ పై అవినీతి ఆరోపణల వ్యవహారంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆమె ప్రొవిజినల్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేసింది. అంతేగాక, భవిష్యత్తులో మళ్లీ నియామక పరీక్షలు రాయకుండా డిబార్ చేసింది. ఈమేరకు అధికారులు బుధవారం ఆదేవాలు ఇస్తూ వివరాలు వెల్లడించారు. పుణెలో ట్రైనీ సహాయ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పూజా ఖేడ్కర్ పై అధికార దుర్వినియోగంతో పాటు యూపీఎస్సీలో తప్పుడు అఫిడవిట్ పత్రాలు సమర్పించారనే ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో ఈ వ్యవహారంపై యూపీఎస్సీ దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలోనే ఆరోపణలపై వివరణ ఇవ్వాలంటూ ఖేడ్కర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అయితే, దీనికి ఆమె నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో చర్యలు తీసుకున్నట్లు కమిషన్ పేర్కొంది. జులై 25లోగా నోటీసులకు సమాధానం ఇవ్వాలని ఆదేశించాం. కానీ, ఆమె ఆగస్టు 4 వరకు గడువు కావాలని కోరింది. ఇందుకు తిరస్కరించి.. జులై 30 వరకు అదనపు సమయం కల్పించాం. ఇదే చివరి అవకాశమని.. ఎలాంటి పొడిగింపులు ఉండవని స్పష్టంచేశాం. కానీ, ఆమె గడువులోగా తమ సమాధానాన్ని సమర్పించలేదు. అందువల్ల సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్-2022లో ఆమె ప్రొవిజినల్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేస్తున్నాం. భవిష్యత్తులో కమిషన్ నిర్వహించే నియామక పరీక్షలు/ఎంపికలకు హాజరుకాకుండా శాశ్వతంగా డిబార్ చేస్తున్నాం అని యూపీఎస్సీ ఓ ప్రకటనలో వెల్లడించింది. యూపీఎస్సీ పరీక్ష నిబంధనల్ని అతిక్రమిస్తూ అవకాశాలు వాడుకొని ఆమె నకిలీ పత్రాలతో పరీక్షను క్లియర్ చేసినట్లు గుర్తించామని గతంలో కమిషన్ పేర్కొంది. తన పేరు, తల్లిదండ్రుల పేర్లు, ఫొటోగ్రాఫ్/సంతకం, ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్, చిరునామాకు సంబంధించిన పత్రాలన్నీ మార్చడం ద్వారా మోసపూరిత ప్రయత్నాలకు పాల్పడ్డారని వెల్లడించింది. ఈ క్రమంలోనే ఆమె ప్రొబేషన్‌ను నిలిపివేసి.. ముస్సోరిలోని లాల్‌బహదూర్ శాస్త్రి జాతీయ అకాడమీకి తిరిగి రావాలని ఆదేశించగా ఆమె అక్కడికి వెళ్లలేదు. మరోవైపు, చీటింగ్-ఫోర్జరీ ఆరోపణలకు సంబంధించి ఇప్పటికే ఆమెపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ముందస్తు బెయిల్ నిమిత్తం ఆమె ఇటీవల దిల్లీ కోర్టును ఆశ్రయించింది. దీనిపై ఆగస్టు 1వ తేదీన న్యాయస్థానం తీర్పు వెలువరించనుంది.

# రేవంత్‌కు కెసిఆర్ ఫోబియా

**పదేళ్ల పనుల్లో కెసిఆర్ ఉన్నారు**
**ఆయన ఆనవాళ్లను చెరిపేయలేరు**
**అసెంబ్లీలో కెటిఆర్ విమర్శలు**

**హైదరాబాద్,జూలై31(పీపుల్స్ మోటివేషన్):**

గత పదేండ్లలో ఏం మంచి జరిగిందో చెబుదామంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కేసీఆర్ ఫోబియా పట్టుకుందని సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తెలిపారు. మాట్లాడితే కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తామని అంటున్నారు. చేరిపేయలేని, తుడిపేయలేని, దాచెయ్యలేని ఆనవాళ్లు కేసీఆర్ ఆనవాళ్లు. ఎలా చెడిపేస్తారు కేసీఆర్ ఆనవాళ్లను అని ప్రశ్నిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ నిప్పులు చెరిగారు.కాళేశ్వరం జలసవ్వడిలో కేసీఆర్.. కాకతీయ చెరువు మత్తడిలో కేసీఆర్.. భగీరథ నల్ల నీళ్లలో కేసీఆర్.. పాలమూరు జలధారల్లో కేసీఆర్.. సీతారామ ఎత్తిపోతల్లో కేసీఆర్.. గురుకుల బడిలో కేసీఆర్.. యాదాద్రి గుడి యశస్సులో కేసీఆర్.. విరజిమ్మే విద్యుత్ వెలుగుల్లో కేసీఆర్.. మెడికల్ కాలేజీల వైద్య విద్య విప్లవంలో కేసీఆర్.. కలెక్టరేట్ భవనాల కాంతుల్లో కేసీఆర్.. కమాండ్ కంట్రోల్ సెంటర్ హైట్స్‌లో కేసీఆర్.. మీరు కూర్చున్న సచివాలయపు సౌధ రాజసంలో కేసీఆర్.. టీ హబ్, టీ వర్క్స్, వీ హబ్ సృజనలో కేసీఆర్.. వ్యూహాత్మక రహదారుల దర్జాలో కేసీఆర్.. ప్రపంచంలోని అతి పెద్ద అంబేద్కర్ విగ్రహ మెరుపుల్లో కేసీఆర్.. అమర దీపం ఆశయల్లో కేసీఆర్.. అని కేటీఆర్ పేర్కొన్నారు. శాసనసభలో ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ విమర్శలు గుప్పించే ప్రయత్నం చేశారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అభినందించడం కాదు.. అభిశంసించాలి అని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఎందుకు ఈ ప్రభుత్వాన్ని అభినందించాలని కేటీఆర్ నిలదీశారు. చక్కటి బ్జడెట్ ప్రవేశపెట్టాం.. మమ్మల్ని అభినందిస్తారేమో అని అనుకున్నట్టు భట్టి విక్రమార్క మాట్లాడుతున్నారు. ఎందుకు అభినందించాలి..? ఏం చూసి అభినందించాలి..? ఆరు నూరైనా ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి మాట తప్పినందుకు అభినందించాలా..? డిక్లరేషన్లకు దిక్కు మొక్కు లేకుండా చేసినందుకు అభినందించాలా.? 420 హామీలను తుంగలో తొక్కినందుకు అభినందించాలా..? అభినందించడం కాదు మిమ్మల్ని అభిశంసించాలి. మన దగ్గర రీకాల్స్ సిస్టం లేదు కాబట్టి ఈ రాష్ట్ర ప్రజలు నాలుగేండ్లు భరించాలి తప్ప మరో మార్గం లేదు. ఎన్నో హామీలు, వాగ్దానాలు ఇచ్చి మరిచారు. అరచేతిలో వైకుంఠం చూపించి, నానా మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారు. వాటిని చేయలేక ఇప్పుడు ఇబ్బంది పడుతున్నారు. మార్పు రావాలి కాంగ్రెస్ రావాలి అని స్లోగన్‌తో యాడ్స్ చేశారు. ఈ మార్పు మార్పు అనే దానికి పల్ల దుర్గయ్య అనే కవి మంచి పద్యం చెప్పారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆ పద్యం సరిగ్గా సరిపోతుందని తెలుపుతూ కేటీఆర్ ఆ పద్యాన్ని సభలో చదివి వినిపించారు.

# తెలంగాణలో రైతురుణ మాఫీ

**హర్షం వ్యక్తం చేస్తూ ఎక్స్‌లో రాహుల్ పోస్ట్**

**న్యూఢిల్లీ,జూలై31(పీపుల్స్ మోటివేషన్):**

తెలంగాణలో ప్రస్తుతం రైతు రుణాల మాఫీ పండుగ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు. తెలంగాణలో రైతుల పంట రుణాలను మాఫీ చేయడంపై రాహుల్ గాంధీ హర్షం వ్యక్తం చేశారు . ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. తెలంగాణలో మరో ఎన్నికల హామీని నెరవేర్చామని పోస్ట్ చేశారు. 'తెలంగాణలో రైతులకు మళ్లీ శుభాకాంక్షలు. మన ఎన్నికల హామీ ప్రకారం.. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రుణమాఫీ రెండవ విడతను విడుదల చేసింది. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం.. రాష్ట్రంలోని 6.4 లక్షల రైతు కుటుంబాలకు రూ. 1.5 లక్షల వరకు రుణాన్ని మాఫీ చేసి వారిని ఆదుకుంది. ఒక వైపు బీజేపీ దేశవ్యాప్తంగా రైతులను అప్పుల ఊబిలో కూరుకునేలా చేయడమే కాకుండా ఎంఎస్‌పీకి చట్టబద్ధత కూడా కల్పించడం లేదు. అందుకు భిన్నంగా కాంగ్రెస్ ప్రతి సందర్భంలోనూ రైతు కుటుంబాలకు సహాయం అందించడానికి కృషి చేస్తుంది. ఎఔఆఎం కూటమి భారత దేశ రైతులకు ఓ-ూఖ పైన చట్టపరమైన హామీ ఇచ్చి, రుణ విముక్తులను చేస్తుందని ఎక్స్‌లో రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఎన్నికల హామీలో భాగంగా రైతు రుణాలు మాఫీ చేస్తామని కాంగ్రెస్ నాయకత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ హామీకి కట్టుబడి.. ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు రుణమాఫీ పక్రియను ప్రారంభించారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్లుగా రూ. 2 లక్షల వరకు ఉన్న పంట రుణాలను విడతల వారీగా మాఫీ చేస్తామని అన్నారు. అన్నట్లుగానే తొలి విడత రుణమాఫీ పక్రియను జులై 18న ప్రారంభించింది రాష్ట్ర ప్రభుత్వం. తొలి విడతలో రూ. 1 లక్షల వరకు ఉన్న పంట రుణాలు మాఫీ చేశారు. అర్హులైన 11.50 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 6,098 కోట్లు జమ చేశారు. రెండో విడతలో భాగంగా 6,40,223 మంది రైతులకు రూ. 6190.01 కోట్లు విడుదల చేశారు. మొత్తం రెండు విడతల్లో కలిపి రాష్ట్ర వ్యాప్తంగా 17.75 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. 12,224 కోట్లు జమ చేసి రైతు రుణాలు మాఫీ చేసింది రాష్ట్ర ప్రభుత్వం. ఆగష్టు 15వ తేదీ నాటికి రూ. 2 లక్షల వరకు ఉన్న రుణాలను మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation

గురువారం । ఆగస్టు । 1 । 2024



# పతకానికి చేరువలో భారత బాక్సర్ లవ్లీనా..!

భారత మహిళా బాక్సర్, ఒలింపిక్ మెడలిస్ట్ లవ్లీనా బోర్గహైన్ మరోసారి సత్తా చాటింది. పారిస్ ఒలింపిక్స్ 2024లో మహిళల బాక్సింగ్ 75 కేజీల విభాగంలో క్వార్టర్ ఫైనల్స్ చేరి మెడల్‌కు అడుగు దూరంలో నిలిచింది. క్వార్టర్ ఫైనల్లో లవ్లీనా విజయం సాధిస్తే బ్రాంజ్ మెడల్ ఖాయం అవుతోంది. బాక్సింగ్‌లో సెమీఫైనల్ చేరిన ఇద్దరు అథ్లెట్లకు బ్రాంజ్ మెడల్స్ ఇస్తారనే విషయం తెలిసిందే. మిగతా ఈవెంట్లలా బాక్సింగ్‌లో కాంస్య పోరు నిర్వహించరు. బుధవారం జరిగిన ప్రిక్వార్టర్స్‌లో లవ్లీనా బోర్గహైన్ 5-0తో నార్వే బాక్సర్ సున్నివా హొఫ్‌స్టాడ్‌పై విజయం సాధించింది. మ్యాచ్ ఆసాంతం పూర్తి ఆధిపత్యం చెలాయించిన లవ్లీనా.. తన పంచ్ పవర్‌తో ప్రత్యర్థిని చిత్తు చేసింది. ముఖ్యంగా తన డిఫెన్సివ్ టెక్నిక్‌తో జడ్జీలను ఆకట్టుకుంది. టోక్యో ఒలింపిక్స్ 2020లో 69 కేజీల విభాగంలో తలపడిన లవ్లీనా బ్రాంజ్ మెడల్‌తో సత్తా చాటింది. ఈ సారి 75 కేజీల విభాగంలో 8వ సీడ్‌గా బరిలోకి దిగిన లవ్లీనా రెండో పతకంపై గురి పెట్టింది. ఆదివారం(ఆగస్ట్ 4) జరిగే క్వార్టర్ ఫైనల్లో లవ్లీనా బోర్గహైన్.. చైనా టాప్ సీడ్ బాక్సర్, టోక్యో సిల్వర్ మెడలిస్ట్ లి కియాన్‌తో తలపడనుంది. లవ్లీనా కంటే లి కియాన్‌కు మెరుగైన రికార్డ్ ఉంది. ఈ ఒక్క మ్యాచ్ గెలిస్తే రెండు ఒలింపిక్స్ మెడల్స్ సాధించిన తొలి బాక్సర్‌గా లవ్లీనా చరిత్రకెక్కుతుంది. మహిళల సింగిల్స్ టేబుల్ టెన్నిస్‌లో భారత ప్లేయర్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ రౌండ్ 16లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన రౌండ్ 32 మ్యాచ్‌లో శ్రీజ 4-2 తేడాతో సింగపూర్ ప్లేయర్ జియాన్‌ను ఓడించింది. మొత్తం 6 సెట్ల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీజ 9-11, 12-10, 11-4, 11-5, 10-12, 12-10 తేడాతో శ్రీజ విజయం సాధించింది. తొలి సెట్‌ను తృటిలో చేజార్చుకున్న శ్రీజ.. రెండో సెట్‌లో పోరాడి గెలిచింది. మూడు, నాలుగు సెట్లలో మాత్రం శ్రీజ అవోకగా విజయం సాధించింది. ఐదో సెట్‌లో సింగపూర్ ప్లేయర్ విజయం సాధించగా.. చివరి సెట్‌లో శ్రీజ గెలుపొందింది. ఈ గెలుపుతో ఒలింపిక్స్ రౌండ్ 16లోకి ప్రవేశించిన రెండో భారత క్రీడాకారిణిగా శ్రీజ రికార్డ్ సాధించింది. ఇప్పటికే మనికా బాత్రా రౌండ్ 16కు అర్హత సాధించిన విషయం తెలిసిందే.







## ప్రిక్వార్టర్స్‌కు చేరిన పీవీ సింధు

పారిస్ ఒలింపిక్స్-2024లో భారత స్టార్ షట్లర్, తెలుగు తేజం పీవీ సింధు వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. గ్రూప్ స్టేజ్‌లో బుధవారం జరిగిన ఉమెన్స్ సింగిల్ మ్యాచ్‌లో ఎస్తేనియా క్రీడాకారిణి క్రిస్టినా కూబాపై 21-5, 21-10 తేడాతో ఘన విజయం సాధించింది. ఈ క్రమంలో ప్రిక్వార్టర్స్‌కు చేరింది. 73వ ర్యాంకర్ క్రిస్టినా కూబాపై పదో సీడ్ సింధు ఆది నుంచి విరుచుకుపడింది. మ్యాచ్ ప్రారంభమైన కాసేపటిలోనే మూడు పాయింట్లు సాధించింది. ఆ తర్వాత సింధు తిరిగి వెనక్కి చూడలేదు. ప్రత్యర్థికి అవకాశం ఇవ్వకుండా తొలి గేమ్‌ను ఏకపక్షంగా మార్చింది. అదే జోరును రెండో గేమ్‌లోనూ కొనసాగించి రౌండ్-16కు చేరింది. మ్యాచ్‌ను 34 నిమిషాల్లోనే ముగించింది. గ్రూప్-ఎమ్‌లో సింధు అగ్రస్థానంలో నిలిచింది. రెండు మ్యాచ్‌ల్లో గెలిచి నాలుగు పాయింట్లు సాధించింది. తొలి మ్యాచ్‌లో మాల్దీవులకు చెందిన అబ్దుల్ రజాక్‌పై సింధు ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రత్యర్థిని చిత్తుచిత్తుగా ఓడించింది. కేవలం 29 నిమిషాల్లోనే 21-9, 21-6తో మ్యాచ్‌ను ముగించింది. కాగా, రియో ఒలింపిక్స్‌లో రజతం, టోక్యోలో కంచు మోత మోగించిన సింధు ఈ విశ్వక్రీడల్లోనూ పతక లక్ష్యంగా బరిలోకి దిగింది. పారిస్ ఒలింపిక్స్‌లో సింధు పతకం సాధిస్తే .. ఒలింపిక్స్‌లో మూడు పతకాలు సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా ఆమె చరిత్రకెక్కుతుంది. గత కొన్నాళ్లుగా తమ సామర్థ్యానికి తగ్గట్లుగా ప్రదర్శన చేయనప్పటికీ సింధు విశ్వక్రీడల్లో తిరిగి సూపర్ ఫామ్‌లోకి రావడం భారత్‌కు శుభసూచకం.

## ఆర్చర్ విభాగంలో ప్రీక్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లిన దీపికా కుమారి



మహిళల వ్యక్తిగత ఆర్చరీ విభాగంలో దీపికా కుమారి ప్రీక్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంది. ప్యారిస్ ఒలింపిక్స్ మ్యాచ్‌లో దీపిక 6-2తో నెదర్లాండ్స్‌కు చెందిన క్వింటీ రోఫెన్‌ను ఓడించింది. క్వింటిపై దీపిక 2-0తో ఆరంభంలోనే ఆధిక్యం సాధించింది. దీపిక తొలి సెట్‌లో 29 పాయింట్లు సాధించగా.. నెదర్లాండ్స్‌కు చెందిన ఆమె ప్రత్యర్థి 28 పాయింట్లు చేసింది. తొలి సెట్‌లో ఆధిక్యంలోకి వెళ్లిన దీపిక 27-29 స్కోరుతో క్వింటి చేతిలో రెండో సెట్‌ను కోల్పోయింది. ఒకానొక సమయంలో వీరిద్దరి మధ్య మ్యాచ్ 2-2తో సాగింది. అయితే, దీపిక మూడో సెట్‌లో పుంజుకుని 4-2తో ఆధిక్యంలో నిలిచింది. అప్పటికి.. దీపిక 25 పాయింట్లు సాధించగా, క్వింటీ 17 పాయింట్లు చేసింది. నెదర్లాండ్స్‌కు చెందిన ఈ క్రీడాకారిణి మొదటి షాట్‌ను బయట ఆడడంతో ఆమెకు పాయింట్ రాలేదు. దీంతో తర్వాతి సెట్‌లో దీపిక ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా సులువైన విజయాన్ని నమోదు చేసింది. దీపిక రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్ ఆగస్టు 3న జరగనుంది. అందులో దీపిక ప్రత్యర్థి జర్మనీకి చెందిన మిచెల్ క్రోపెన్ తో తలపడనుంది.

## ప్రిక్వార్టర్స్ చేరిన లక్ష్యసేన్..!



పారిస్ ఒలింపిక్స్ 2024లో భారత షట్లర్లు దుమ్మురేపుతున్నారు. ఇప్పటికే మహిళల సింగిల్స్‌లో స్టార్ షట్లర్ పీవీ సింధు ప్రీ క్వార్టర్స్ చేరగా.. తాజాగా పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ ప్రీ క్వార్టర్స్‌కు అర్హత సాధించాడు. బుధవారం జరిగిన తన చివరి లీగ్ మ్యాచ్‌లో లక్ష్యసేన్ 21-18, 21-12 తేడాతో ప్రపంచ నాలుగో ర్యాంకర్, ఇండోనేషియా షట్లర్ జొనాథన్ క్రిస్టీపై విజయం సాధించింది. తొలి గేమ్‌లో ఇండోనేషియా బాక్సర్ నుంచి గట్టి పోటీని ఎదుర్కొన్న లక్ష్యసేన్.. ఓ దశలో 2-8తో వెనుకబడి ఓటమి దిశగా సాగాడు. కానీ ఆ తర్వాత అద్భుత పుంజుకొని ఆధిక్యం సాధించడంతో పాటు గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో గేమ్‌లోనూ ఇదే జోరును కనబర్చి సునాయసంగా విజయం సాధించాడు. దాంతో గ్రూప్-ఎల్ నుంచి ప్రిక్వార్టర్స్‌కు అర్హత సాధించాడు. మొత్తం 16 గ్రూప్స్ నుంచి ఒక్కో ప్లేయర్ క్వార్టర్ ఫైనల్‌కు చేరనున్నారు. అంతకుముందు తెలుగు తేజం పీవీ సింధు రెండో విజయాన్ని నమోదు చేసింది. తన చివరి గ్రూప్ మ్యాచ్‌లో సింధు 21-5, 21-10 తేడాతో ఎస్తేనియా క్రీడాకారిణి క్రిస్టినా కూబాను ఓడించింది. ఈ గెలుపుతో ప్రిక్వార్టర్స్‌కు అర్హత సాధించింది. 73వ ర్యాంకర్ క్రిస్టినా కూబాపై పదో సీడ్ సింధు ఆది నుంచి విరుచుకుపడింది. మ్యాచ్ ప్రారంభమైన కాసేపటిలోనే మూడు పాయింట్లు సాధించింది. ఆ తర్వాత సింధు తిరిగి వెనక్కి చూడలేదు. ప్రత్యర్థికి అవకాశం ఇవ్వకుండా తొలి గేమ్‌ను ఏకపక్షంగా మార్చింది. అదే జోరును రెండో గేమ్‌లోనూ కొనసాగించి రౌండ్-16కు చేరింది. మ్యాచ్‌ను 34 నిమిషాల్లోనే ముగించింది. గ్రూప్-ఎమ్‌లో సింధు అగ్రస్థానంలో నిలిచింది. రెండు మ్యాచ్‌ల్లో గెలిచి నాలుగు పాయింట్లు సాధించింది. తొలి మ్యాచ్‌లో మాల్దీవులకు చెందిన అబ్దుల్ రజాక్‌పై సింధు ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రత్యర్థిని చిత్తుచిత్తుగా ఓడించింది. కేవలం 29 నిమిషాల్లోనే 21-9, 21-6తో మ్యాచ్‌ను ముగించింది. కాగా, రియో ఒలింపిక్స్‌లో రజతం, టోక్యోలో కంచు మోత మోగించిన సింధు ఈ విశ్వక్రీడల్లోనూ పతక లక్ష్యంగా బరిలోకి దిగింది. పారిస్ ఒలింపిక్స్‌లో సింధు పతకం సాధిస్తే .. ఒలింపిక్స్‌లో మూడు పతకాలు సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా ఆమె చరిత్రకెక్కుతుంది.

## పీవీ సింధు ఫేక్ ప్రొఫైల్ క్రియేట్ చేశా..

### మను బాకర్ ఆసక్తికర వ్యాఖ్యలు!

భారత మహిళా షూటర్ మను బాకర్ సరికొత్త చరిత్రను లిఖించింది. ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా ఈ హరియాణా అమ్మాయి రికార్డుల్లో నిలిచింది. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం గెలిచిన 22 ఏళ్ల మను.. అదే వేదికపై సహచరుడు సరబ్‌జోత్ సింగ్‌తో కలిసి 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. రెండు పతకాలు సాధించిన మను తాజాగా ఓ ఆసక్తికర విషయాన్ని వెల్లడించింది. భారత స్టార్ షట్లర్ పీవీ సింధు కోసం తాను ఓ ఫేక్ ప్రొఫైల్‌ను క్రియేట్ చేశానని తెలిపింది. 'భారత క్రీడా చరిత్రలో గొప్ప వారి గురించి నేను ఎప్పుడూ తెలుసుకుంటూనే ఉంటా. ప్రస్తుత తరంలో పీవీ సింధు, నీరజ్ చోప్రా బాగా తెలుసు. ఇద్దరు గొప్ప అథ్లెట్స్. వారి శ్రమను అభినందించలేకుండా ఉండలేం. ఓ సమయంలో నేను పీవీ సింధు కోసం ఫేక్ ప్రొఫైల్‌ను క్రియేట్ చేశా. కొందరు అనుచిత వ్యాఖ్యలు చేస్తుండటంతో వారి నుంచి ఆమెను డిఫెండ్ చేయడానికి ఫేక్ ప్రొఫైల్ క్రియేట్ చేశా. నెటిజన్లకు కౌంటర్ ఇస్తూ అడ్డుకొనేందుకు ప్రయత్నించా' అని మను బాకర్ తెలిపింది. ఈ అంశంపై తాజాగా తెలుగు తేజం పీవీ సింధు స్పందించింది. 'మీ మంచి మనసుకు ధన్యవాదాలు. రెండు ఒలింపిక్ పతకాల క్లబ్‌లోకి మను బాకర్‌కు స్వాగతం. మేం కూడా నీ మార్గంలోనే ఉన్నాం' అని సింధు పేర్కొన్నారు. పీవీ సింధు నేడు బరిలోకి దిగనుంది. మహిళల సింగిల్స్ పోటీలో క్రిస్టిన్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ మధ్యాహ్నం జరగనుంది. ఇందులో విజయం సాధిస్తే క్వార్టర్స్‌కు చేరుకుంటుంది.

## మా కుర్రాళ్ల ఆటే ఆకర్షించింది: సూర్య


తాను వేసిన చివరి ఓవర్ మ్యాజిక్ కంటే.. కుర్రాళ్లు ఆడిన ఆటతీరే బాగా ఆకర్షించిందని టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు. 200లకు పైగా స్కోర్లు చేసి విజయం సాధిస్తే ఎలా సంబరపడతామో.. 70 పరుగులకే సగం వికెట్లను కోల్పోయినా ఏమాత్రం వెనుకడుగు వేయకుండా ఆటను ఆస్వాదించాలన్నాడు. తాను కేవలం కెప్టెన్‌గా ఉండటానికి రాలేదని, నాయకుడిగా ఉండాలనేదే తన కోరిక అని చెప్పాడు. మంగళవారం రాత్రి శ్రీలంకతో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో భారత్ సూపర్ ఓవర్లో విజయం సాధించింది. ఈ మ్యాచ్ విజయంలో సూర్య కీలక పాత్ర పోషించాడు. మ్యాచ్ అనంతరం సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ%ూ% 'చివరి ఓవర్ మ్యాజిక్ కంటే మా కుర్రాళ్లు బ్యాటింగ్ చేసిన ఆటతీరే నన్ను ఆకర్షించింది. బ్యాటింగ్‌లో 30/4, 48/5 స్కోరు సమయంలో మా కుర్రాళ్లు బాగా ఆడడంతో ప్రత్యర్థిపై పోరాడే అవకాశం మాముందుంది. ఈ పిచ్‌పై 140 పరుగులను కాపాడుకోవడం పెద్ద కష్టమేం కాదు. మేము ఫీల్డింగ్ చేసే సమయంలో మా ప్లేయర్స్‌కు ఒకటే చెప్పా. గంటన్నరలో చివరి నిమిషం వరకూ మనస్సును నిమగ్నం చేస్తే విజయం సాధించవచ్చని చెప్పాను. 200ం స్కోర్లు చేసి విజయం సాధిస్తే ఎలా సంబరపడతామో.. 70 పరుగులకే సగం వికెట్లను కోల్పోయినా ఏమాత్రం వెనుకడుగు వేయకుండా ఆటను ఆస్వాదించాలి. అప్పుడే జీవితం సమతూకంగా అనిపిస్తుంది' అని అన్నాడు. మా యువ ఆటగాళ్లకు ఆత్మవిశ్వాసం చాలా ఎక్కువ. దీంతో నా పని తేలికైంది. గ్రౌండ్‌లో, డ్రెస్సింగ్ రూమ్‌లో పాజిటివ్ దృక్పథం ఉంది. గత మ్యాచ్‌కు ముందే కొందరికి విశ్రాంతి ఇస్తామని చెప్పాం. అందరికీ అవకాశం రావాలంటే అలా చేయాల్సిందే.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation



# గేమ్ ఛేంజర్ నుంచి కియారా పోస్టర్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్'. శ్రీ వెంకటేశ్వర సినీ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాతలు దిల్ రాజు , శిరీష్ ఈ మూవీని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ట్రిపుల్ ఆర్ వంటి సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ మూవీ తర్వాత రామ్ చరణ్ నటిస్తోన్న సినిమా అవడంతో మూవీపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పటికే సినిమా నుంచి విడుదల చేసిన జరగండి అనే పాటను మంచి హైప్‌ను తీసుకువచ్చాయి. తాజాగా బుధవారం చిత్ర హీరోయిన్ కియారా అద్వాని పుట్టిన రోజును పురస్కరించుకుని 'గేమ్ చేంజర్' సినిమా నుంచి కియారా అద్వాని లుక్‌ను మేకర్స్ రిలీజ్ చేస్తూ మా జాబిలమ్మకు జన్మదిన శుభాకాంక్షలు అంటూ పోస్టర్ విడుదల చేశారు. ఇదిలాఉండగా ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉండగా డిసెంబర్‌లో ఈ సినిమాను థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రముఖ తమిళ దర్శకుడు జిగర్తాండ పేమ్ కార్తీక్ సుబ్బరాజ్ ఈ సినిమాకు కథ అందించడం విశేషం. తమన్ సంగీతం అందిస్తున్నాడు.







## విడుదలకు సిద్ధంగా రెండు భారీ సినిమాలు




### 15న రానున్న డబుల్ ఇస్మార్, మిస్టర్ బచ్చన్

రామ్ కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రానున్న సినిమా 'డబుల్ ఇస్మార్ట్', అలాగే హీరో రవితేజ– డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. ఈ రెండు మూవీలు ఆగస్టు 15న విడుదల కానున్నాయి. తాజాగా వీటికి సంబంధించిన అప్‌డేట్స్ సోషల్ మీడియాలో సందడి చేస్తోన్నాయి. 'డబుల్ ఇస్మార్ట్'లో మాస్ పాత్రలో కనిపించనున్న రామ్ పోతినేని.. క్లాసీ లుక్‌లో తన పాత్రకు డబ్బింగ్‌ను పూర్తి చేశారు. దీనికి సంబంధించిన వీడియోను పంచుకున్నారు. 'మాస్ మ్యాడ్‌నెస్‌కు సిద్ధమా' అనే క్యాప్షన్ పెట్టారు. మరోవైపు 'మిస్టర్ బచ్చన్' పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ఈ చిత్రంలో తన పాత్రకు డబ్బింగ్ పూర్తి చేసినట్లు కథానాయిక భాగ్యశ్రీ బోర్సే వెల్లడించారు. ఆమెకు ఇది టాలీవుడ్‌లో తొలి సినిమా అయినప్పటికీ స్వయంగా తెలుగు నేర్చుకొని తానే డబ్బింగ్ చెప్పారని చిత్రబృందం తెలిపింది. దీంతో సోషల్ మీడియాలో ఆమెపై ప్రశంసలు వెల్లువెత్తు తున్నాయి.'డబుల్ ఇస్మార్ట్' విషయాకిస్తే.. పూరి–రామ్‌ల హిట్ కాంబోలో తెరకెక్కిన 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా ఇది రానుంది. ఆ సినిమా ప్రేక్షకాదరణ సొంతం చేసుకోవడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అలాగే 'మిస్టర్ బచ్చన్' టీజర్, పాటలు ప్రేక్షకుల్లో ఆసక్తిని కలిగించాయి. 'ప్రేక్షకుల్ని పాత జ్ఞాపకాల్లోకి తీసుకెళ్తుందీ చిత్రం' అని విడుదల చేసిన వీడియోలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. యూట్యూబ్‌లోనూ భారీ వ్యూస్‌తో ట్రెండింగ్‌లో కొనసాగుతున్నాయి.

# రామాయణంలోకి అడుగు పెడుతున్న కునాల్



బాలీవుడ్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ'. నితేశ్ తివారీ దర్శకత్వంలో బాలీవుడ్ అగ్ర నిర్మాతలతో కలిసి అల్లు అరవింద్ దీన్ని రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి వార్తలు సోషల్ మీడియాలో ఎన్నోసార్లు వైరల్ కాగా.. తాజాగా ఈ భారీ ప్రాజెక్ట్‌లో మరో నటుడు భాగం కానున్నారనే వార్త తెగ షేర్ అవుతోంది. బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్ 'రామాయణ'లో  కీలకపాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. దీనికోసం ఆయనకు స్క్రీన్ టెస్ట్ కూడా నిర్వహించినట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. తన పాత్ర కోసం రిహార్సల్స్ చేస్తున్నారని టాక్. అయితే, ఈ పాత్రకు సంబంధించిన వివరాలను చిత్రబృందం గోప్యంగా ఉంచాలని భావిస్తోందట. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో రానున్న 'విశ్వంభర'లోనూ కునాల్ నటిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో ఆయన విలన్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. 'రామాయణ' విషయానికొస్తే.. చిత్రాన్ని రెండు భాగాలుగా తీయాలని మేకర్స్ భావిస్తున్నారు. 2025 డిసెంబర్ నాటికి షూటింగ్ పూర్తి చేయాలనుకుంటున్నారు. దీని కోసం పన్నెండు భారీ సెట్లను కూడా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అయోధ్య, మిథిలా నగరాలను తలపించేలా వాటిని తీర్చి దిద్దుతోందట మూవీ యూనిట్. 3డీ ఫార్మాట్‌లో, భారీ వ్యయంతో ముంబయిలో వీటిని రూపొందిస్తున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే దీని షూటింగ్‌ను ప్రారంభించారు. ఈ చిత్రీకరణకు సంబంధించిన కొన్ని ఫొటోలు కూడా సోషల్ మీడియాలో ఇటీవల సందడి చేశాయి. ఇందులో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ , సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీ దేవోల్, కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్‌ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక సమాచారం కోసం సినీ ప్రియులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# బాలయ్య 50 ఏళ్ల సినీ ప్రస్థానం

### సెప్టెంబర్ 1న ఘన సన్మానికి నిర్ణయం

నందమూరి బాలకృష్ణ 50ఏళ్ల సినీ ప్రయాణం సందర్భాన్ని పురస్కరించుకుని తెలుగు సినీ పరిశ్రమ ఆయనను ఘనంగా సన్మానించాలని నిర్ణయం తీసుకుంది.నందమూరి బాలకృష్ణ తొలిసారి నటించిన 'తాతమ్మ కల' సినిమా 1974 ఆగస్టు 30న విడుదలైంది. అంటే రానున్న ఆగస్టు 30కి బాలకృష్ణ నటుడిగా 50 సంవత్సరాలు పూర్తి చేసుకోబోతున్నారు. ఈ సందర్భంగా ఈ క్రమంలో తెలుగు చలన చిత్ర వాణిజ్యమండలి కార్యదర్శి కె.ఎల్.దామోదర్ ప్రసాద్, అధ్యక్షుడు సునీల్ నారంగ్, తెలుగు సినీ నిర్మాతల మండలి కార్యదర్శి టి.ప్రసన్నకుమార్, తెలుగు సినీ కార్మిక సమాఖ్య అధ్యక్షుడు వల్లభనేని అనిల్ ఇటీవల బాలకృష్ణని కలిసి, సన్మాన వేడుకు అంగీకరించాలని కోరగా అందుకు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ నేసథ్యంలో సెప్టెంబర్ 1న సాయంత్రం హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా ఈ ఉత్సవం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు.ఈ సన్మాన వేడుకకు దేశ వ్యాప్తంగా అన్ని సినిమా ఇండస్ట్రీలు, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులను ఈ వేడుకకు ఆహ్వానిస్తున్నారు. ఈ నేపథ్యంలో బాలకృష్ణ సినిమా రంగానికి చేసిన, చేస్తున్న సేవలను ప్రస్తావిస్తూ ఓ ఆహ్వాన పత్రికను రూపొందించి విడుదల చేశారు. ఇందులో బాలకృష్ణ సినిమాల పరంగా సాధించిన రికార్డులను, రాజకీయాల్లో, సామాజిక కార్యమాల్లో ఆయన చేస్తున్న సేవలను పొందుపరిచారు. ఇప్పుడు ఈ ఆహ్వాన పత్రిక సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. మీరూ చూసేయండి.

Printed, Published and Owned by M.RAMESH, H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh State, and Printing at PSR Printers, No.87-569, Beside, Chenchureddy Apartment, Madhava nagar,Kurnool - 518002 District, Andhrapradesh, Published from H.No. H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh, Editor : M.RAMESH, Mob : 8008622746,E-mail : peoplesmotivation22@gmail.com